ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 15, ఆగస్టు 2024



వేడుకలకు సిద్ధమైన ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్



త్రివర్ణ విద్యుత్ దీపాలతో ధగధగలాడుతున్న ఒంగోలులోని ప్రకాశం భవన్

స్వాతంత్ర్య దిన వేడుకలకు
సర్వం సిద్ధం

- ఒంగోలు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో భారీ ఏర్పాట్లు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి స్వామి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 14 : భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 78వ భారత స్వాతంత్ర్య వేడుకులకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి గురువారం ఉదయం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. వివిధ రంగాల్లో విశిష్టసేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ స్టాల్స్, శకటాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతలను వివరిస్తూ పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించనున్నారు. మరోవైపు వేడుకల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. వేడుకలను తిలకించేందుకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధరంగాల ప్రముఖులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచే దేశభక్తి ఉప్పొంగింది. ఎక్కడికక్కడ జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు త్రివర్ణ విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్నాయి.

ఒంగోలులో జాతీయ జెండాతో భారీ ర్యాలీ

ఆజాదీకా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు దేశభక్తిని చాటేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పేస్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో స్థానిక చర్చి సెంటర్ నుంచి బుధవారం ఏర్పాటుచేసిన 700 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శనను కలెక్టర్ అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా సెల్ఫీపాయింట్లు, తిరంగా సిగ్నేచర్ క్యాంపెయినింగ్, తిరంగా యాత్రలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం కోసం సమరయోధులు ఎంతో కృషిచేశారన్నారు. ఎన్నో త్యాగాలు చేశారని గుర్తుచేశారు. వారి త్యాగాలను, కృషిని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ చర్చిసెంటర్ నుంచి రిమ్స్ వరకూ సాగింది. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో విద్యార్థులు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఉషారాణి, లోకేశ్వరరావు, రవికుమార్‌తోపాటు పేస్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఒంగోలులో 700 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ టీడీపీ కైవసమైంది. వైసీపీకి చెందిన మెజారిటీ కార్పొరేటర్లు వరుసగా పార్టీలోకి క్యూకట్టారు. అధికార పార్టీకి జైకొట్టారు. మేయర్, డిప్యూటీ మేయర్ కూడా సైకిలెక్కారు. దీంతో కార్పొరేషన్‌పై కూటమికి పట్టు దక్కింది. బుధవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో ఈమేరకు వారంతా సమావేశమై అభివృద్ధికి సహకరిస్తామని ప్రకటించారు. మేయర్, డిప్యూటీ మేయర్‌తోపాటు ఐదుగురు కార్పొరేటర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి జనార్దన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అయితే మెజారిటీ కార్పొరేటర్లు చేరడంతో కార్పొరేషన్ పగ్గాలు టీడీపీ చేతికి రావడం లాంఛనమే.

- ఒంగోలులో వైసీపీకి భారీ షాక్!
- ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో భారీగా చేరికలు
- సైకిలెక్కిన మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ బుజ్జి
- మరో ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు కూడా
- నాయుడుపాలెంలో కార్యక్రమం
- నగర పాలక సంస్థలో కూటమికి పూర్తి పట్టు
- రెండు, మూడు రోజుల్లో సీఎం చంద్రబాబుకు పరిచయం



తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీకి చెందిన ఒంగోలు మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

కార్పొరేషన్ టీడీపీ పరం

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 14: ఒంగోలులో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి వెంకట సూర్యనారాయణ (బుజ్జి)తోపాటు మరో ఐదుగురు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. బుధవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సొంతూరు తూర్పునాయుడుపాలెంలో ఆయన సమక్షంలో వారంతా సైకిలెక్కారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాగా ఎన్నికలకు ముందు ఐదుగురు కార్పొరేటర్లు టీడీపీలో చేరగా, ఫలితాల అనంతరం మరో ఏడుగురు చేరారు. కొద్దిరోజులుగా మేయర్ చేరికపై అనేక అనుమానాలు తలెత్తాయి. పార్టీలో చేరుతారని సంకేతాలు వచ్చినప్పటికీ ఢిల్లీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ధర్నాలో ఆమె నేరుగా పాల్గొనడం చర్చనీయాంశమైంది. దీంతో ఆమె చేరికపై పలు అనుమానాలు నెలకొన్నాయి. ఆ తర్వాత ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని ఒంగోలులో, ఎమ్మెల్యే దామచర్లను హైదరాబాద్, ఒంగోలులో రెండుసార్లు కలిశారు. దీంతో మేయర్ చేరికపై దోబూచులాట కొనసాగింది. ఎట్టకేలకు ఉత్కంఠకు తెరపడింది. బుధవారం ఆమె టీడీపీలో చేరి ప్రజల్లో నడుస్తున్న చర్చకు ఫుల్‌స్టాప్ పెట్టారు. దీంతో కొద్దిరోజుల క్రితం వరకు ఒంగోలు కార్పొరేషన్ పాలకవర్గం వైసీపీ మెజారిటీ సభ్యులతో కొనసాగగా, బుధవారంతో టీడీపీ కూటమి కైవసం చేసుకుంది. కార్పొరేషన్ పగ్గాలు టీడీపీ చేతికి వచ్చేందుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మొదటి నుంచి పక్కా ప్రణాళికలతో ముందుకు సాగారు. పార్టీశ్రేణుల అభిప్రాయాలను తీసుకున్నారు. వైసీపీ కార్పొరేటర్ల చేరిక వల్ల ఎటువంటి ఇబ్బంది రాకుండా చూస్తానంటూ భరోసా ఇచ్చారు. మొత్తంగా కొద్దిరోజుల నుంచి చర్చనీయాంశంగా మారిన వైసీపీ కార్పొరేటర్ల చేరిక ఎపిసోడ్‌కు బుధవారంతో తెరపడింది. ఇప్పటికే మేయర్, డిప్యూటీ మేయర్‌తోపాటు పదిహేడు మంది టీడీపీలో చేరగా, మరో ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు రెండు రోజుల్లో చేరనున్నట్లు సమాచారం.

త్వరలోనే సీఎం చంద్రబాబు వద్దకు..

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై టీడీపీలో చేరినట్లు వైసీపీ కార్పొరేటర్లు ప్రకటించారు. తూర్పునాయుడుపాలెంలోని ఎమ్మెల్యే దామచర్ల స్వగృహంలో బుధవారం వారంతా టీడీపీకి జైకొట్టారు. వారికి దామచర్ల పార్టీ జెండాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇక నుంచి కార్పొరేషన్‌లో టీడీపీ కూటమి పాలకవర్గం కొనసాగనుందని తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో సీఎం చంద్రబాబు వద్దకు అందరినీ తీసుకెళ్లి పరిచయం చేయనున్నట్లు సమాచారం.

నగర అభివృద్ధి కోసమే : ఎమ్మెల్యే జనార్దన్

'ఒంగోలు నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సమష్టిగా ముందుకెళ్తాం. గతంలో టీడీపీ సభ్యుల సంఖ్య తక్కువగా ఉన్నందున అభివృద్ధి కోసం పోరాడినా సాధ్యపడలేదు. అయితే తాజాగా వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరడం సంతోషంగా ఉంది. ఒంగోలులో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నాం. వైసీపీలో ఉండి కూడా అభివృద్ధి చేయలేకపోయామన్న భావనలో ఉన్న కార్పొరేటర్లు టీడీపీ కూటమిపై నమ్మకంతో పార్టీలో చేరడం అభినందనీయం. అందరినీ సమన్వయం చేసుకుని అభివృద్ధి చేయడమే మా ముందున్న లక్ష్యం. రహదారులు, డ్రైన్‌ల నిర్మాణం, రోజూ నీటిసరఫరా, పోతురాజు కాలువ ఆధునికీకరణ, పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టిసారించాం. రాబోయే ఐదేళ్లలో ఒంగోలు నగరాన్ని అందంగా మార్చి అభివృద్ధి చేస్తాం' అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు.

అభివృద్ధికి నిర్వచనం దామచర్ల.. అందుకే టీడీపీలోకి : మేయర్

'ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని చూశాం. అభివృద్ధి, సంక్షేమం చేయడంలో ఆయన కృషి అభినందనీయం. నగర అభివృద్ధి కోసం దామచర్లతో కలిసి పనిచేయాలన్న లక్ష్యంతోనే తనతోపాటు మరికొంతమంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరాం. ఇంకా ఎన్నో సమస్యలు పెండింగ్ ఉన్నాయి. పోతురాజు కాలువ ఆధునికీకరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోజూ తాగునీటి సరఫరాతోపాటు, కార్పొరేషన్ కార్యాలయానికి సొంత భవనం అవసరం ఉంది. ఎమ్మెల్యే సహకారంతో వాటిని సాధించుకోగలమన్న నమ్మకం ఉంది.

ఆరు నుంచి 26కు పెరిగిన బలం

నగరంలో మొత్తం 50 డివిజన్‌లు ఉండగా గత మునిసిపల్ ఎన్నికల్లో ఆరుగురు టీడీపీ కార్పొరేటర్లు గెలుపొందారు. వారితోపాటు జనసేన కార్పొరేటర్ ఒకరు ఉండటంతో కూటమి సభ్యుల సంఖ్య ఏడుకు పరిమితమైంది. అయితే ఓ కార్పొరేటర్ ఇండిపెండెంట్‌గా గెలుపొంది అప్పట్లో వైసీపీ కండువా కప్పుకున్నారు. దీంతో వైసీపీ సభ్యుల సంఖ్య 43కు చేరింది. కౌన్సిల్ సమావేశంలో వారిదే పైచేయిగా ఉండటంతోపాటు అజెండాలో పొందుపరిచిన పలు అంశాలపై ప్రతిపక్ష టీడీపీ అడ్డుపడినా, అభ్యంతరాలు తెలియజేసినా తీర్మానాలను ఏకపక్షంగా ఆమోదించారు. కాగా 2024 సాధారణ ఎన్నికలకు ముందు ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ఫలితాల అనంతరం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆతర్వాత దశలవారీగా ఏడుగురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పుడు మేయర్, డిప్యూటీ మేయర్‌తోపాటు మరో ఐదుగురు సైకిలెక్కడంతో టీడీపీ పైచేయి సాధించింది. ప్రస్తుతం కార్పొరేషన్‌లో టీడీపీ-6, జనసేన-1 ఉండగా, తాజాగా 19మంది వైసీపీ సభ్యులు సైకిలెక్కడంతో టీడీపీ కార్పొరేటర్ల సంఖ్య 26కు చేరుకుంది. దీంతోపాటు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ కార్పొరేషన్ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉండటంతో ఆ పార్టీ బలం 29కి చేరింది. దీంతో కార్పొరేషన్ పాలకవర్గం టీడీపీ కూటమిదే అయ్యింది.

పంచాయతీ నిధులు గోల్‌మాల్

- 8 నెలల్లో రూ.12 లక్షలు అక్రమంగా డ్రా
- వైసీపీ అండతో తర్లుపాడు కార్యదర్శి నిర్వాకం
- తన సొంత, సర్పంచ్ భర్త ఖాతాల్లోకి మళ్లింపు
- ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు

తర్లుపాడు, ఆగస్టు 14: ప్రభుత్వం మారినా తర్లుపాడు పంచాయతీ కార్యదర్శి తీరు మారలేదు. ఇంకా వైసీపీతో అంటకాగుతూ యథేచ్ఛగా నిధులు గోల్‌మాల్ చేస్తున్నాడు. దీనికితోడు ఉన్నతాధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఐదేళ్ల నుంచి ఆయన అక్రమాలకు అంతులేకుండా పోయింది. సర్పంచ్ భర్తతో కుమ్మక్కై యథేచ్ఛగా నిధుల దోపిడీకి పాల్పడ్డారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడుతున్నాడు. ఎలాంటి పనులు చేయకుండానే గత 8నెలల కాలంలో రూ.20లక్షల మేర నిధులు డ్రా చేశాడు. అందులో రూ.12లక్షల మేర బొక్కేసినట్లు తెలుస్తోంది. ఈనెల 1న కూడా ఎలాంటి బిల్లులు కానీ, ఎం బుక్కులుకానీ లేకుండా రూ.4,14,606 బ్యాంకు నుంచి తీశాడు. సచివాలయం నిర్వహణ పేరుతో కార్యదర్శి సొంత అకౌంట్‌కు రూ.98,435, ప్రభాకర్ పేరుతో మోటారు రిపేర్ కింద రూ.2,99,107, సర్పంచ్ గౌరవ వేతనం రూ.17,064 డ్రా చేశాడు. గడచిన ఫిబ్రవరిలో కూడా సచివాలయ నిర్వహణ కోసం కార్యదర్శి రూ.40,000 డ్రా చేసి సొంత అకౌంట్‌కు మళ్లించుకున్నాడు. ఏప్రిల్‌లో రూ.60,000, మేలో రూ.25వేలు సచివాలయం నిర్వహణ పేరుతో డ్రా చేశాడు. 15వ ఫైనాన్స్ కమిషన్ కింద చెత్త ట్రాక్టర్ డీజిల్ కోసం రూ.2,61,108, బ్లీచింగ్ సున్నంకు రూ.2,17,660, బోర్ల రిపేర్ కింద రూ.6లక్షలు, కాలువల్లో పూడికతీత పనుల కోసం రెండుమార్లు రూ.1,35,000, వీధిలైట్ల కోసం రూ.1,35,000 డ్రాచేసి మింగేశాడు.



లైట్లు లేవు, పారిశుధ్యం అధ్వానం

తర్లుపాడులో ఏడాది నుంచి వీధి లైట్లు వేసిన దాఖలాలు లేవు. పారిశుధ్యం మచ్చుకు కూడా కనిపించలేదు. ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండానే ఆ పేరుతో పంచాయతీ నిధులు అక్రమంగా డ్రా చేసిన విషయాన్ని గుర్తించి ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడుతున్నాడు. రెండు నెలల క్రితం ఒక విలేకరి తర్లుపాడు పంచాయతీ నిధుల గురించి సమాచారం అడిగితే ఆయనపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాడు. అదేసమయంలో పంచాయతీ రికార్డులు పోయాయంటూ సచివాలయంలో పనిచేస్తున్న వీఆర్వో భాస్కర్‌రెడ్డిపై కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 45 రోజుల క్రితం పంచాయతీ నిధుల వివరాలు ఇవ్వాలని టీడీపీ యువనేత కందుల రోహిత్ రెడ్డి, మరో 20 మంది నాయకులతో కలిసి లిఖిత పూర్వకంగా అర్జీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు సమాచారం ఇచ్చిన దాఖలాలు లేవు. గతంలో ఈవోపీఆర్‌డీగా అమరేశ్వరరావు విధులపట్ల అంకితభావంతో పనిచేశారు. ఆయన వైసీపీ సర్పంచ్‌లు చేసే అవకతవకల బిల్లులపై సంతకాలు చేసేందుకు నిరాకరించారు. దీంతో వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చి ఆయనతో దీర్ఘకాలిక సెలవు పెట్టించారు. దీంతో తర్లుపాడు కార్యదర్శి అచ్యుత్‌రావుకు ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీగా బాధ్యతలు ఇచ్చారు. ఆయన వైసీపీ నాయకులతో అంటకాగి వారు ఏం చెబితే అదే వేదంగా పనిచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంచాయతీ కార్యదర్శి సొంత అకౌంట్‌లోకి డబ్బులు డ్రా చేసుకోకూడదు. దాన్ని తుంగలోకి తొక్కి కార్యదర్శి సొంత అకౌంట్‌లోకి నిధులు మళ్లించుకున్నాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తర్లుపాడు పంచాయతీ కార్యదర్శి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

బిల్లులు లేకుండా నిధులు డ్రా వాస్తవమే

తర్లుపాడు పంచాయతీ కార్యదర్శి ఎలాంటి బిల్లులు లేకుండా ఈనెల 1న రూ.4,14,606 డ్రా చేసిన మాట వాస్తవమేనని ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, ఈవోపీఆర్‌డీ బాలకృష్ణ తెలిపారు. తర్లుపాడు పంచాయతీ నిధుల అవకతవకలపై ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఈవోపీఆర్‌డీ తెలిపారు.

మంచంపట్టిన పాలుట్ల

- 30 మందికి పైగా విషజ్వరాలు
- వారిలో 10 మందికిపైనే ఎర్రగొండపాలెం ఆసుపత్రిలో చేరిక
- వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు గిరిజనుల విజ్ఞప్తి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోతమ్మ, వీరమ్మ



చేతికి క్యాన్‌లాతో చిన్నారులు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 14 : మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని పాలుట్ల గూడెంలో 30 మందికి పైగా గిరిజనులు విషజ్వరాలు, మలేరియాతో మంచం పట్టారు. వీరిలో పెద్దలు, పిల్లలు కలిపి 10 మందికిపైగా ఎర్రగొండపాలెం వైద్యశాలలో బుధవారం చేరి చికిత్స పొందుతున్నారు. జ్వరం సోకిన చిన్న పిల్లలకు వైద్యులు సెలైన్ బాటిళ్లను ఎక్కిస్తున్నారు. ఎర్రగొండపాలేనికి 40 కి.మీ దూరంలో ఉన్న పాలుట్ల గూడెం నుంచి వైద్యశాలలకు రావాలంటే రహదారి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజుల నుంచి జ్వరం తగ్గకపోవడంతో చెవుల పొట్టి పోతమ్మ, చెవుల వీరమ్మ, మండ్లి అంజయ్య, మరో ఐదుగురు వైద్యశాలలో చేరి చికిత్స పొందుతున్నారు. గూడెంనకు చెందిన చిన్నారులు కుడుముల నందిని, దేశావత్ అభినాయక్, నిర్మల, చెవుల హనుమమ్మ, చెవుల అంజలి, దంసాని వీరయ్య తదితరులు జ్వరంతో బాధపడుతుండటంతో తల్లిదండ్రులు ఎర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. వీరు గాక గూడెంలో మరో 20 మందికి పైగా జ్వరాలు ఉన్నాయని దేశావత్ సురేష్ నాయక్, గూడెం గిరిజనులు తెలిపారు. కలెక్టర్ స్పందించి వెంటనే వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పరిమితంగానే పని సర్దుబాటు

- విద్యాశాఖ కమిషనర్ వెల్లడి

ఒంగోలు(విద్య), ఆగస్టు 14 : ఉపాధ్యాయుల పని సర్దుబాటు పరిమితంగానే జరగనుంది. సర్దుబాటుపై వారంరోజులుగా చర్చోపచర్చలు జరిగాయి. విద్యాశాఖ కమిషనర్ మొదట జారీ చేసిన ఉత్తర్వులను రద్దుచేశారు. తాజాగా మళ్లీ జారీచేశారు. అవి కూడా ఉపాధ్యాయులను శాంతింపజేయలేదు. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి నేరుగా చర్చించాలని టీచర్ల సంఘాలు పట్టుబట్టాయి. దీంతో మెట్టు దిగిన కమిషనర్ బుధవారం పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘాలతో సమావేశం నిర్వహించారు టీచర్ల సర్దుబాటు పరిమితంగానే ఉంటుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులకు హామీ ఇచ్చారు. వారి డిమాండ్లకు సానుకూలంగా స్పందించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు సర్దుబాటు ఎక్కడ అవసరముంటుందో అక్కడ మాత్రమే చర్యలు తీసుకుంటారు. టీచర్లను తాము పనిచేస్తున్న మేనేజ్‌మెంట్లలోనే సర్దుబాటు చేస్తారు. అప్పటికి మిగిలితే ఇతర మేనేజ్‌మెంట్లకు పంపుతారు. 70 శాతం అంగవైకల్యం ఉన్న వారికి మినహాయింపు ఇచ్చారు. 1 నుంచి 8 తరగతులకు కనీసం ఐదు ఎస్‌జీటీలు ఉండేలా చర్యలు తీసుకుంటారు. 2025 మే 31లోపు రిటైర్ అయ్యే టీచర్లకు మినహాయింపు ఉంటుంది. టీచర్ల గ్రీవెన్స్‌కు అవకాశం ఇస్తారు. ఉత్తర్వుల్లో పేర్కొన్న విధంగా ఇతర డివిజన్లకు టీచర్లను పని సర్దుబాటు చేయరు. ఉపాధ్యాయ సంఘాల డిమాండ్లు యథావిధిగా ఆమోదిస్తే మిగులు టీచర్లను మళ్లీ తేల్చేందుకు మరింత సమయం పడుతుంది. ఫలితంగా పనిసర్దుబాటు మరికొంత ఆలస్యం కానుంది.

1న ఒంగోలులో అంతర్రాష్ట్ర కరాటే పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, నిర్వాహకులు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 14: సిద్ధార్థ కరాటే అకాడమీ 42వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 1 నుంచి ఒంగోలులో నిర్వహించే అంతర్రాష్ట్ర కరాటే పోటీల పోస్టర్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ 42 సంవత్సరాలుగా ఎంతోమందికి కరాటేలో శిక్షణ అందిస్తూ, వారి ఆత్మ రక్షణకు అవసరమైన మెలకువలు నేర్పించడం అభినందనీయం అన్నారు. అకాడమీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అకాడమీ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ స్థానిక కర్నూలురోడ్‌లోని మహాలక్ష్మి ఫంక్షన్ హాలులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు సుమారు 800 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటకలోని 62 శాఖల ద్వారా నిత్యం వందలాదిమంది శిక్షణ పొందుతున్నారని, ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విజేతలైన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు నల్లూరి మోహన్‌రావు, చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, ప్రతినిధులు మండవ సుబ్బారావు, దుగ్గినేని వెంకట్రావు, నాగరాజు పాల్గొన్నారు.

వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తేవాలి

- ఐఎంఏ డిమాండ్



నగరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్యవిద్యార్థులు, నర్సులు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 14: ప్రజల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు నిరంతరం కృషి చేస్తుంటే, వారిపైనే దాడులు, దౌర్జన్యాలు, హత్యలు చేయడం దారుణమని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రావిపాటి జయశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలు నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించి మానవ హారం చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ ఝాన్సీ మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌లో మహిళ వైద్యురాలిపై అత్యాచారం చేసి, దారుణంగా హత్య చేయడం దుర్మార్గమన్నారు. ఈ ఘటనకు కారకులైన నిందితులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అందుకోసం సీబీఐ విచారణ వేయాలని చెప్పారు. వైద్య వృత్తి ఎంతో విలువైనదని, అయితే వారి జీవనానికి, వృత్తికి రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ప్రభుత్వ వైద్యశాలలో, మెడికల్ కాలేజీల్లో మహిళల రక్షణ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులకు రక్షణ కల్పించాలని, ఆసుపత్రులపై, వైద్యులపై దాడులు చేసిన వారికి కఠిన శిక్షలు పడే చట్టాలు తేవాలని కోరారు. డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వైద్యుల దాడులు హేయమైన చర్యన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డాక్టర్ జాలాది మణిబాబు మాట్లాడుతూ మహిళా డాక్టర్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ జయశేఖర్ మాట్లాడుతూ వైద్యులపై దాడులు నిరసిస్తూ జీజీహెచ్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కొవిడ్ సమయంలో ఇండియన్ డాక్టర్లు ప్రాణాలకు తెగించి సేవలు అందిస్తే నేడు వారిపై దుర్మార్గకరంగా అత్యాచారాలు, హత్యలు చేయడం దారుణం ఉందని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్‌ను కలిసి వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులు, మెడికల్ విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

- ఎస్పీ దామోదర్
- ముమ్మరంగా వాహన తనిఖీలు
- 300 బైక్‌లు సీజ్



సీజ్ చేసిన బైక్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 14: నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తామని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. ఇందుకోసం వాహనదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. బుధవారం ఒంగోలులో పోలీసులు బైక్‌లు, ఆటోలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు విరుద్ధంగా తిరుగుతున్న 300 మోటార్‌సైకిళ్లను సీజ్ చేశారు. నగరంలో ఉదయం నుంచి రాత్రి వరకు 50 ప్రాంతాలలో తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. సైలెన్సర్లు మాడిఫైడ్ చేసి తిరుగుతున్న 150 బైక్‌లు, నంబరు ప్లేట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవి 100, ఇతర కారణాలతో మరో 50 మోటార్‌సైకిళ్ళను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ నగరంలో పలు ప్రాంతాలను పరిశీలించి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భద్రతాచర్యల్లో భాగంగా నగరంలో వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. అదే సమయంలో ద్విచక్రవాహనదారులు సైలెన్సర్లు మార్చి పెద్దపెద్ద శబ్దాలు చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని, అలాంటి వాహనాలను సీజ్ చేసి సైలెన్సర్లు మార్పు చేయిస్తున్నామని చెప్పారు. నగరంలో ట్రాఫిక్ సమస్యపై వారం రోజుల్లో ఆర్టీసీ, ఆటోడ్రైవర్లు, ప్రజలతో అవగాన సదస్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇక నుంచి ద్విచక్ర వాహనదారులు ఇష్టారాజ్యంగా వాహన చోదన చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ తనిఖీలలో 350 మంది సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ వై.పాండురంగారావు, వన్‌టౌన్ సీఐ నాగరాజు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: ఎస్పీ ఆదేశాల మేరకు నాగులుప్పలపాడు పోలీసులు బుధవారం ఒంగోలు-చీరాల జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహన అనుమతి పత్రాలు లేకుండా నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

అన్ని విధాలా నియోజకవర్గ అభివృద్ధి కృషి

- ఎమ్మెల్యే బీఎన్



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, ఆగస్టు 14 : సంతనూతలపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చీమకుర్తి మండలంలో అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శ్రీకారం చుట్టారు. చినరావిపాడు నుంచి గుడిపూడివారిపాలెం వరకు మండలపరిషత్ నిధులతో రూ.79లక్షల వెచ్చించి బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బీఎన్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలతో పాటు అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టి వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. మండల అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గొట్టిపాటి రాఘవరావు, నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, గాలి వెంకటసుబ్బయ్య, వెంపరాల ఆంజనేయులు, వేల్పుల శ్రీనివాసరావు, రావిపాటి రాంబాబు, పుట్టా బ్రహ్మయ్య, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, కూరాకుల కరుణాకరరెడ్డి, కూనం లోకేష్, బొడ్డు రామారావు, అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేసే ఐదుగురు దొంగలు అరెస్టు

10 కిలోలు గంజాయి, బైక్, 100 కిలోల రాగితీగ స్వాధీనం



సీజ్ చేసిన గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్ఐలు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 14: అర్ధరాత్రుళ్లు పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలించి రాగి తీగ చోరీలు చేస్తూ గంజాయి వ్యాపారం చేసే ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు తెలిపారు. బుధవారం ఒంగోలులోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన పసుమర్తి లక్ష్మీనారాయణ, కనిగిరి మండలం చాకిరాలకు చెందిన మల్లెల కొండారెడ్డి, ఒంగోలు నగరం ఇస్లాంపేటకు చెందిన ఎస్‌కే.ఆరీఫ్, కనిగిరి మండల పాతూరుకు చెందిన నాగులూరి బాలరాజు, చీమకుర్తి వెంకటేశ్వరకాలనీకి చెందిన కుంచాల అంకమ్మరాజులను అరెస్టు చేసినట్లు తెలిపారు. బుధవారం ఉదయం మద్దిపాడు మండలం గుండ్లకమ్మ ఆర్చీ వద్ద అనుమానాదస్పదంగా తిరుగుతున్న ఐదుగురుని అరెస్టు చేసి వారి వద్ద పది కిలోలు గంజాయి, బైక్, 100 కిలోలు రాగి తీగ, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై మద్దిపాడు, చీమకుర్తి, ఒంగోలు తాలుకా, కనిగిరిలో పలు కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న ఏఎస్పీ (క్రైమ్స్) శ్రీధర్‌రావు, రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, మద్దిపాడు ఎస్సై మహేష్‌లను ఎస్పీ దామోదార్ ప్రత్యేకంగా అభినందించారు.

గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

- మండల సమావేశంలో సర్పంచ్‌ల డిమాండ్



సర్పంచ్‌లకు జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీపీ అరుణ

మద్దిపాడు, ఆగస్టు 14: గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీవ్ర రూపం దాల్చాయని వాటిపై తక్షణ చర్యలు చేపట్టాలని సీతారాంపురం సర్పంచ్ మండవ శివానందరావు డిమాండ్ చేశారు. బుధవారం మద్దిపాడులోని మండల పరిషత్ సమావేశపు హాలులో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అరుణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలపై ఆశాఖ అధికారులను సభ్యులు ప్రశ్నించారు. దీనిపై ఏఈ చెన్నారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని తెలిపారు. అన్ని గ్రామాల్లో 24 గంటలు కరెంటు సరఫరా ఉండేలా చర్యలు తీసుకున్నామని, అవసరమైన చోట స్తంభాలను ఏర్పాటుచేసి కరెంటు సమస్యలు తలెత్తకుండా చూస్తామని తెలిపారు. ఘడియపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, ఎంపీటీసీ పైనం ప్రభాకర్ మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్టు ప్రధాన ముంపు గ్రామమైన ఘడియపూడిలో శ్మశానస్థలం లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీతారాంపురం సర్పంచ్ మండవ శివానందరావు మాట్లాడుతూ రేషన్ బియ్యం ప్రజలందరికీ అందేవిధంగా చూడాల్సిన బాధ్యత డీలర్లపై ఉందన్నారు. పంచాయతీరాజ్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ సచివాలయ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఎంఈవో ఆంజనేయులు మాట్లాడుతూ పాఠశాలలో మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. కాగా టీబీ నిర్మూలనలో భాగంగా గత ఏడాది ఘడియపూడి, దొడ్డవరప్పాడు పంచాయతీలల్లో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఈక్రమంలో సంబంధిత సర్పంచ్‌లు రామాంజనేయులు, బెజవాడ శ్రీరామమూర్తిలకు ఎంపీపీ అరుణ చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. సమావేశంలో పశువైద్యురాలు మాధవి, మండల పరిషత్ సూపరింటెండెంట్ చుండూరి వెంకటసుబ్బారావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

‘మీటరు రీడింగ్‌లో పొరపాటు లేదు’

‘ఆంధ్రజ్యోతి’ కథనానికి విద్యుత్‌శాఖ అధికారుల స్పందన

కొండపి, ఆగస్టు 14 : సింగరాయకొండ మండలం కలికివాయికి చెందిన లైన్‌ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి ఇంటికి సంబంధించిన విద్యుత్ మీటర్ రీడింగ్‌లో ఎలాంటి పొరపాటు జరగలేదని ట్రాన్స్‌కో డీఈఈ (ఆపరేషన్) పి.యుగంధర్, ఏఈఈ సిహెచ్.సాంబశివరావు తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో గుండె గు‘బిల్లు’ శీర్షికన ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కలికివాయిలో వెంకటస్వామి ఇంటికి సర్వీసు నంబర్ 4522230000560తో విద్యుత్ మీటరు ఉందని తెలిపారు. ఈ సర్వీసుకు 1,07,441 రూపాయల బిల్లు వచ్చిందని వివరించారు. వెంకటస్వామితోపాటు కలికివాయి జేఎల్ఎం ఓబుల్‌రెడ్డిల సమక్షంలో మీటరును ఒంగోలు ల్యాబ్‌లో పరిశీలించడం జరిగిందన్నారు. మీటరులో పొరబాటు లేదని తేలిందని పేర్కొన్నారు. అనంతరం అధికారులు సరిచేసి వెంకటస్వామికి వచ్చిన బిల్లులో రూ.38,924 తగ్గించి రూ.68,517 కట్టాలని చెప్పారన్నారు. అందులో వెంకటస్వామి ఇప్పటి వరకూ రూ.30,004 చెల్లించారని తెలిపారు. ఇందులో విద్యుత్ శాఖ తప్పిదం లేనందున మిగతా మొత్తాన్ని చెల్లించాల్సిందేనని వారు స్పష్టం చేశారు. వెంకటస్వామి ఇల్లు డోర్ లాక్‌లో ఉండటం వల్ల ఒక్కసారి భారీగా బిల్లు వచ్చిందని యుగంధర్, సాంబశివరావు ఆ ప్రకటనలో వివరించారు.

అవీ..ఇవీ..

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు : దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 14 : ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 78 ఏళ్ల స్వాతంత్ర్యంలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ప్రపంచపటంలో భారతదేశానికి ఒక ప్రత్యేకతను చాటుకున్న స్వాంత్ర్య దినోత్సవాన్ని ప్రతి ఒక్కరు ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

16న మాజీ కలెక్టర్ కత్తి చంద్రయ్య శత జయంతి వేడుకలు



మాట్లాడుతున్న నిహారిక

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 14 : ప్రకాశం జిల్లా మొట్టమొదటి కలెక్టర్ కత్తి చంద్రయ్య 100 సంవత్సరాల జయంతి వేడుకలను ఈనెల 16న ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు చంద్రయ్య కుటుంబసభ్యులు తెలిపారు. బుధవారం స్థానిక ఎన్‌జీఓ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కత్తి చంద్రయ్య మనుమరాలు ఎ.నిహారిక మాట్లాడుతూ తమ తాతయ్య చంద్రయ్య కలెక్టర్‌గా జిల్లా ప్రజలకు సుపరిచుతలన్నారు. ఆయన జయంతి వేడుకలను ఒంగోలులో నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4-30 గంటలు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు, బాపట్ల ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కృష్ణప్రసాద్‌లతోపాటు, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్‌లు, కలెక్టర్ తమీమ్ అన్సారియా, పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు.

అక్రమాలకు పాల్పడిన జోగి రమేష్ : నూకసాని

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 14 : వైసీపీ నాయకుడు జోగి రమేష్ చేసిన అక్రమాలు నిజమని తెలిసిన తర్వాతనే అరెస్టులు జరిగాయని, అందువలనే పీసీ యాక్ట్ కింద అధికారులు కేసులు నమోదు చేశారని, అయితే కేసుల నుంచి తప్పించుకునేందుకు బీసీ కార్డు అడ్డుపెట్టుకోవాలని చూడటం హేయమైన చర్యని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ విమర్శించారు. బుధవారం స్థానిక భాగ్యనగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నూకసాని మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని జోగి రమేష్ కటుంబ సభ్యులు చేసిన అక్రమాలు ఒకొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న అగ్రి గోల్డ్ ఆస్తులను సర్వే నెంబర్ 88లోని భూమిని సర్వే నెంబర్ 87లో ఉన్నట్లు చూపించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించి, రమేష్ అతని కుమారుడు, బాబాయి కాజేశారని ఆరోపించారు. వీఆర్వో లాగిన్‌లోకి వెళ్ళి సర్వే నెంబర్లను తారుమరు చేసిన ఘనుడు అని పేర్కొన్నారు.

శ్రీప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

నాగులుప్పలపాడు, ఆగస్టు 14: మద్దిరాలపాడు గ్రామంలో నూతనంగా ఈ నెల 18న శ్రీప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. ఈక్రమంలో బుధవారం ప్రతిష్ఠా ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. తొలిరోజు ప్రసన్నాంజనేయస్వామి ధ్వజయంత్ర, గ్రామోత్సవ కార్యక్రమానికి దాతలు కాటా శ్రీనివాసులు, విజయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నెప్పల ఉమాదేవి, పెనుబోతు సునీల్, పెనుబోతు చిట్టిబాబు, చెరుకు రమేష్ బాబు, తాళ్ళూరి కృష్ణారావు, ఉద్దినేని ఏడుకొండలు, ఉద్దినేని శేషయ్య పాల్గొన్నారు. అనంతరం ఒంగోలులో ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను గ్రామస్థులు కలిసి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



గురవారెడ్డి మృతదేహం

కొండపి, ఆగస్టు 14 : పొలంలో పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందారు. ఈ ఘటన కొండపి పంచాయతీ పరిధిలోని దాసరెడ్డిపాలెంలో బుధవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు దాసరెడ్డిపాలెంనకు చెందిన రైతు కాటంరెడ్డి గురవారెడ్డి (52) తన బంధువుల పొలాన్ని కౌలుకు తీసుకొన్నారు. అందులో వరి నారుమడి పెట్టే పనులు చేస్తుండగా అక్కడి విద్యుత్ స్తంభం వద్ద ఉన్న తీగ తగిలి షాక్‌కు గురై మృతి చెందారు. సమాచారం అందుకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గురవారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలుకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణబాజీబాబు తెలిపారు. గురవారెడ్డికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కొండపి సీఐ సోమశేఖర్ బాధ్యతల స్వీకరణ



సీఐ సోమశేఖర్

కొండపి, ఆగస్టు 15 : కొండపి సీఐగా జి.సోమశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన పాండురంగారావు ఒంగోలు ట్రాఫిక్ సీఐగా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో సోమశేఖర్ నియమితులయ్యారు. ఆయన గతంలో కొండపి ఎస్సైగా కూడా పనిచేశారు.

గొర్రెల కాపరిని కొట్టిన యజమాని

సంతనూతలపాడు, ఆగస్టు 14: గొర్రెల కాపరిని యజమాని కొట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏఎస్సై వెంకట్రావు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలో మైనంపాడుకు చెందిన పెరుగుక్రిష్ణ వద్ద గొర్రెల కాపరిగా కొండేపి గోపి అనే వ్యక్తి గత కొంతకాలంగా పనిచేస్తున్నాడు. ఇటీవల వారి మధ్య పని విషయంలో వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో గోపిపై యజమాని క్రిష్ణ దాడి చేసి కొట్టినట్లు బాధితుడి భార్య శిరీష బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంపీడీడీవో రాఘువేంద్ర బాధ్యతల స్వీకరణ

సంతనూతలపాడు, ఆగస్టు 14: గతంలో సంతనూతలపాడు ఎంపీడీవోగా పనిచేసిన రాఘవేంద్ర ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీ అయ్యి బుధవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఈక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఉన్న ప్రసాద్ బాధ్యతలను రాఘవేంద్రకు అప్పగించారు.

టంగుటూరు కళాశాల ప్రిన్సిపాల్‌గా చక్రపాణి



చక్రపాణిని సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

టంగుటూరు, ఆగస్టు 14 : పంచాయతీ పరిధిలోని పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అక్కడే పనిచేస్తున్న కెమిస్ట్రీ అధ్యాపకుడు తొట్టెంపూడి చక్రపాణి నియమితులయ్యారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బంది చక్రపాణిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను ఘనంగా సత్కరించారు.

పాఠశాల భవనాల పరిశీలన



అనంతవరంలో పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

టంగుటూరు, ఆగస్టు 14 : మండలంలోని అనంతవరం, తాళ్లపాలెంలో ని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను విద్యాశాఖ డీఈ రావిపాటి జగన్మోహన్‌రావు, విద్యాశాఖ ప్రతినిధి బెజ్జం రమేష్‌బాబు బుధవారం పరిశీలించారు. అక్కడ శిథిలావస్థకు చేరిన ఒక భవనాన్ని ఇటీవల కూల్చివేశారు. దానిస్థానంలో కొత్తది నిర్మిస్తామని, మరో భవనం మరమ్మతులకు అంచనాలు రూపొందిస్తామని డీఈ వెల్లడించారు. అనంతరం తాళ్లపాలెం చేరుకొని అక్కడ శిథిలావస్థకు చేరిన స్కూల్ భవనాన్ని పరిశీలించారు. నూతన భవనం నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తామని తెలిపారు. ఇటీవల అనంతవరం ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి స్వామిని కలిసి ఎస్సీ కాలనీలో పాఠశాల భవనం దుస్థితిని వివరించారు. వెంటనే ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి మంత్రి తీసుకెళ్లారు. ఆమె ఆదేశాలతో అధికారులు పాఠశాల భవనాలను పరిశీలించారు.

బీవీఎస్ఆర్ ట్రస్ట్ సేవలు మరింత విస్తృతం

చీమకుర్తి, ఆగస్టు 14 : బీవీఎస్ఆర్ ,ఆరిటబుల్ ట్రస్ట్ సేవలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి జయంతిని పురస్కరించుకొని బుధవారం చీమకుర్తిలో ఆయన విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, చైర్మన్ రాజ్యలక్ష్మి, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, సోమా శేషాద్రి, శేఖరరెడ్డి పాల్గొన్నారు.



ఒంగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు


చీమకుర్తిలో జాతీయజెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


టంగుటూరులో జాతీయ జెండాలు పంచుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు కోటేశ్వరరావు

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు

• ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రమైన ఒంగోలులో భారీ ర్యాలీ నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా మోటార్ సైకిల్ ర్యాలీని స్థానిక కర్నూలు రోడ్డు పై ఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు, అద్దంకి బస్టాండు, పాత మార్కెట్ సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షుడు వైసీ.యోగయ్యయాదవ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్ కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కృషి వివరించారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచవ్యాప్తంగా భాతరదేశ గుర్తింపునకు విశేష సేవలు చేస్తున్నారని చెప్పారు. దేశ సమైక్యత, సమగ్రత, జాతీయ భావాలు పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం ప్రతి ఇంటి మీదము వ్వెన్నల జెండాలు రెపరెపలాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.దామోదర్, పీవీ.కృష్ణారెడ్డి, గుర్రం రంగనాథ్, తిరుమలశెట్టి శ్రీరాములు, సంజీవ్‌కుమార్, రాయపాటి అజయ్, కావూరి వాసు, ఐ.సీతారామయ్య, నాయక్, బొద్దులూరి ఆంజనేయులు, తానికొండ సురేష్, కటారి సుధాకర్, విజయ్, .దనిశెట్టి రాము, విజయరావు, సత్యవతి, డి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్విస్ కళాశాలలో..

ఒంగోలు(విద్య): స్థానిక క్విస్ ఇంజనీరింగ్‌కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్విస్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నిడమామూరి కళ్యాణచక్రవర్తి జాతీయస్ఫూర్తిని వివరించి విద్యార్థులను ఉత్తేజితులను చేశారు. అనంతరం 78అడుగుల జాతీయజెండాను క్విస్ కళాశాల నుంచి వెంగముక్కలపాలెం వరకు విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి నవనీత్ కృష్ణణ్, ఎన్‌సీసీ విభాగాధిపతి వాసుబాబు పాల్గొన్నారు.

మూలగుంటపాడులో 400 అడుగుల జాతీయ జెండాతో..

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం 400 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇది మూలగుంటపాడు హైస్కూల్ నుంచి ప్రారంభమై ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ప్రధాన రహదారి నుంచి కందుకూరు రోడ్డు కూడలి వరకూ సాగింది. దాదాపు 1,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో బీవీ నరసింహమూర్తి, మూలగుంటపాడు పంచాయతీ కార్యదర్శి కొప్పోలు రామారావు, ఎన్.సురేంద్ర, హెచ్‌ఎం కె.శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మూలగుంటపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

టంగుటూరులో..

టంగుటూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక భాష్యం పాఠశాల విద్యార్థులు బుధవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. సుమారు 150 మంది 200 మీటర్ల జాతీయ జెండాను చేతపట్టి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎస్సై సూర్యారావు, పాఠశాల ఉపాధ్యాయులు హాజరయ్యారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు బెల్లం కోటేశ్వరరావు బుధవారం టంగుటూరులో ఇంటింటికీ జాతీయ జెండాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి : మండలంలోని కె.ఉప్పలపాడు జడ్పీ స్కూల్ విద్యార్థులు త్రివర్ణ పతాకాలు చేతబూని గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం వి.సుసన్నకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొన్నలూరులో...

పొన్నలూరులోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులు బుధవారం గ్రామంలో జాతీయ జెండాలతో ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, ఎంఈవో రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో

చీమకుర్తి : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 150అడుగుల జాతీయజెండాను చేతబూనిన చైతన్య పాఠశాల విదార్థులు చీమకుర్తి పట్టణంలో బుధవారం భారీ ర్యాలీని నిర్వహించారు. ఉజ్వల్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకొంటూ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీలిమాదేవి, ఏజీఎం అంజయ్య, రీజనల్ ఇన్‌చార్జి అనిల్‌కుమార్, డీన్ అశోక్, పీఈటీ పెరుగు వెంకట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత జాగృతంతో దేశానికి ఉజ్వల భవిష్యత్

• ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, ఆగస్టు 14 : యువత జాగృతంతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. చీమకుర్తి పట్టణంలోని ఎంఎ స్టార్ జూనియర్ కళాశాల ఆవరణలో యువ జాగృతి కార్యక్రమాన్ని పాత్రుని నాగార్జున, ఎం.హరికృష్ణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కళాశాల విద్యార్థులనుద్ధేశించి స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. యువత క్రమశిక్షణతో మెలగటం ద్వారా ఉన్నతస్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గురువులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వివిధ రకాల పోటీల విజేతలకు విజయ్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ వీవీ.శివారెడ్డి, నిర్వాహకులు నాగార్జున, హరికృష్ణలు ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బదరినారాయణ లను ఘనంగా సత్కరించారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, కందిమళ్ల గంగాధరరావు, కొత్రపు రాఘవరావు, సూరంపల్లి హనుమంతరావు, యడ్లపల్లి రామబ్రహ్మం, అవిశినేని వెంగన్న, రావిపాటి రాంబాబు, జనసేన పార్టీ నాయకులు శివప్రసాద్, నాగరాజు, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

కానిస్టేబుళ్ల కుటుంబాలకు చేయూత

• నగదును అందజేసిన సహచర సిబ్బంది

ఒంగోలు(క్రైం), ఆగస్టు 14: విధినిర్వహణలో మృతి చెందిన ఇరువురు కానిస్టేబుళ్ల కుటుంబానికి సహచర కానిస్టేబుళ్ళు భరోసా కల్పించారు. బుధవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తాళ్లూరు పోలీసుస్టేషన్‌లో పని చేస్తూ గుంటూరు జిల్లా తుళ్లూరులో పాము కాటుకు గురై మృతి చెందిన ఇ.పవన్‌కుమార్ కుటుంబానికి 2012బ్యాచ్‌కి చెందిన కానిస్టేబుళ్ళు రూ.6,97,492, 2009 బ్యాచ్‌కి చెందిన వారు రూ. 1,05,000 మొత్తం రూ.8,02,492లను ఎస్పీ దామోదర్ చేతులు మీదుగా అందజేశారు. అలాగే 2022లో పొదిలిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన కె.శివరామకృష్ణగౌడ్ కుటుబానికి 2012 బ్యాచ్‌కి చెందిన వారు రూ.2,32,800 నగదును ఎస్పీ చేతులు మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూటీ అదుపు తప్పి ఇరువురు మహిళలకు గాయాలు

మద్దిపాడు, ఆగస్టు 14: స్కూటీ అదుపుతప్పి ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం వెల్లంపల్లి వద్ద చోటు చేసుకుంది. ఒంగోలు నగరం గోపాల్‌నగర్‌కు చెందిన ఆర్.సౌజన్య, పి.స్నేహలత స్కూటీపై అద్దంకి వైపు నుంచి వస్తుండగా ఒక్కసారిగా లారీ వేగంగా రావడంతో కంగారుపడి అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

మండవ శ్రీనివాసరావుకు నివాళి

మద్దిపాడు, ఆగస్టు 14: నిబద్ధత కలిగిన కార్యకర్త మండవ శ్రీనివాసరావు అని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు పేర్కొన్నారు. బుధవారం నందిపాడులో శ్రీనివాసరావు దశదిన కర్మ జరిగింది. ఈ సందర్భంగా జయంత్‌బాబు హాజరై ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీకి ఎనలేని సేవలు అందించిన మండవ శ్రీనివాసరావు మరణం మరువలేనిదన్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రీన్‌డే వేడుకలు

ఒంగోలు(విద్య), ఆగస్టు 14: ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో బుధవారం కిండర్ గార్డెన్ విద్యార్థులతో గ్రీన్ కలర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఆకు పచ్చరంగు దుస్తులతో బాబూజీ హాలులో సందడి చేశారు. ఆకుపచ్చ రంగుపై అవగాహన కల్పించేందుకు ఈ వేడుకలను నిర్వహించినట్లు అకడమిక్ డైరెక్టర్ శృతి సాయినాథుని తెలిపారు. చిన్నారులు పచ్చరంగును ప్రతిబింబించే వస్తువులను తయారీ చేసి ప్రదర్శించారు. పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ భాస్కర్, ప్రిన్సిపాల్ శశిలక్ష్మి పాల్గొన్నారు.

22 నుంచి డిగ్రీ రెండో దశ ఆన్‌లైన్ అడ్మిషన్లు

ఒంగోలు(విద్య), ఆగస్టు 14 : ఏపీ ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు ఈనెల 22వ తేదీ నుంచి డిగ్రీ రెండో దశ ఆన్‌లైన్ అడ్మిషన్లు మొదలవుతాయని ఒంగోలు ప్రభుత్వమహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.కళ్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో చేరాలనుకున్న విద్యార్థినులు ఈనెల 22నుంచి 24వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె కోరారు. అలాగే 23వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్లు ఓపెన్ అవుతాయి. 29న సీట్ల కేటాయింపు జరుగుతుందని, సెప్టెంబరు 3 తేదీలోపు జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. తమ కళాశాలలో విద్యార్థుల సహాయకేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సబ్‌జైలులో న్యాయాధికారి తనిఖీ

మార్కాపురం, ఆగస్టు 14: మార్కాపురం సబ్‌జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.శ్యాంబాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సబ్‌జైల్‌లో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ప్రధానంగా వంటగదులు, వంట సామగ్రి, వంటకు వినియోగించే ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, పారిశుధ్యంపై ఆరా తీశారు. ఖైదీల ఫిర్యాదు బాక్స్‌ల గురించి విచారించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, న్యాయవాది రామయ్య, పారాలీగల్ వలంటీర్ బాష తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు సబ్‌జైలులో..

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని సబ్ జైలును బుధవారం ఒంగోలు సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కె.శ్యాంబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఉన్న విచారణ ఖైదీలను, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ జైలులో వారికి అందుతున్న సదుపాయాలు, వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. ఆర్థిక స్థోమత లేని వారికి కేసులను వాదించడానికి ఉచితంగా న్యాయవాదిని పొందవచ్చని, దానికి సంబంధించి మండల లీగల్ సర్వీసెస్ కమిటీకి అర్జీ పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సి.హెచ్.పోలయ్య, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.


సబ్‌జైలును పరిశీలిస్తున్న ఒంగోలు సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్యాంబాబు

రహదారి విస్తరణ పనులకు సహకరించండి


రహదారిని పరిశీలించి స్థానికులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా

● సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా

బేస్తవారపేట,ఆగస్టు14: అనంతపురం-అమరావతి 544 డి నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. బుధవారం బేస్తవారపేట మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నేషనల్ హైవేరోడ్డుకు ఇరువైపులా ఉన్న గృహ యాజమానులతో సమావేశమయ్యారు. గతంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా ప్రజలు అడ్డుకున్నారని, దీంతో రోడ్డు విస్తరణ తగ్గటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. 100 అడుగల రోడ్డు వెడల్పుతో తప్పని సరిగా విస్తరణ పనులు హైవే అధికారులు చేస్తారని, మీకు నష్టపరిహారం మరింత ఎక్కు వ కావాల్సి ఉంటే దరఖాస్తు చేసుకోవాలని వారికి సూచించారు. దీంతో పలువురు సబ్ కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.

రెండు రోజుల తరువాత రెవెన్యూ అధికారులు సర్వేయర్ బృందంతో నేషనల్ హైవే రోడ్డు అధికారులతో ప్రభుత్వానికి సంబంధించిన రోడ్డు ఎంత ఉందో మార్కింగ్ వేస్తారని, తరువాత సెంటర్ నుంచి వారికి కావలసిన కొలతలతో రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తారని, నష్టపరిహారం మరింత పెంచి అందజేస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్.ఫర్వీన్,ఎంపీడీవో టి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నరవలో విగ్రహాల ప్రతిష్ఠ

గిద్దలూరు టౌన్, ఆగస్టు 14 : మండలంలోని నరవ గ్రామంలో పోలేరమ్మ, అంకాలమ్మ సమేత పోతురాజు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ ఈనెల 16వ తేదీ శుక్రవారం నుంచి 19వ తేదీ సోమవారం వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ మహాగణపతి పూజ, రక్షాబంధం, అంకురార్పణ, 17న గణపతిపూజ, ద్వారపూజ, అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం మూల మంత్ర హోమం, 18న ప్రత్యేక పూజలు, 19న హోమం, యంత్రప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పన్ను వసూళ్లపై దృష్టి పెట్టండి

మార్కాపురం రూరల్, ఆగస్టు 14: గ్రామ పంచాయతీలలో ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించి ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా గ్రామాభివృద్ధికి దోహదపడుతుందని ఎంపీడీవో చందన అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో పంచాయతీ కార్యదర్శులకు, ప్రజా ప్రతినిధులకు మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి.

సీఐలు బాధ్యతల స్వీకరణ

గిద్దలూరు టౌన్, ఆగస్టు 14 : గిద్దలూరు అర్బన్, రూరల్ సీఐలుగా కె.సురేష్, జె.రామకోటయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అర్బన్ సీఐగా పని చేస్తున్న సోమయ్య గుంటూరు ఓల్డ్ సిటీకి బదిలీపై వెళ్ళారు మాచర్ల రూరల్ సీఐగా పని చేస్తున్న కె.సురేష్ గిద్దలూరు అర్బన్ సీఐగా బదిలీపై వచ్చారు. అలాగే కంభం సీఐగా పని చేస్తున్న జె.రామకోటయ్య గిద్దలూరు రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టగా ఇక్కడ సీఐగా పని చేస్తున్న ప్రసాద్ బదిలీపై గుంటూరుకు జిల్లాకు వెళ్లారు.

బూతుల డాక్టరుతో బెంబేలు

గతంలో ఓ ఏఎన్‌ఎంను వేధించి డిప్యుటేషన్‌పై వెళ్లిన వైనం

తిరిగి అదే వైద్యశాలకు రాక

ఏఎన్‌ఎంలకు మళ్లీ మొదలైన వేధింపులు

చర్యలు తీసుకోవాలని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు


ఒంగోలులో జిల్లా వైద్యశాఖ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న పుల్లలచెరువు మండల ఏఎన్‌ఎంలు (ఫైల్)

పుల్లలచెరువు, ఆగస్టు 14: ఆయన ప్రభుత్వ వైద్యశాలలో డాక్టరు. నిత్యం ప్రజలకు వైద్యసేవలు అందించి ప్రజల ప్రాణాలు కాపాడి వైద్యో నారాయణో హరి అని అనిపించుకోవాలి.కానీ అందుకు విరుద్ధంగా డాక్టరు వృత్తిలో ఉన్న ఈ ప్రబుద్ధుడు మహిళలు అని కూడా చూడకుండా బూతులతో బహిరంగంగా తీడుతున్నాడని ఏఎన్ఎంలు ఆరోపిస్తున్నారు. వేధింపుల డాక్టర్‌నుంచి కా పాడాలని జిల్లా అధికారులు, టీడీపీ నాయకుల చుట్టూ తిరుగుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.


ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో నేతకు వినతిపత్రం అందజేస్తున్న మండల ఏఎన్‌ఎంలు

పుల్లలచెరువు మండల వైద్యశాలలో వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టరు నాగార్జునగౌడ్ ఆ శాఖ ఉద్యోగులను నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారని ఏఎన్ఎంలు ఆరోపిస్తున్నారు. ఎర్రగొండపాలెంకు చెందిన ఆయన మొదటి నుంచి వివాదాస్పదుడిగా పేరుంది. గత ఏడాది ఓ మహిళా ఏఎన్ఎంను వేధించడంతో ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో వైద్యుడిపై అప్పటి అధికారులు వేటు వేసి ఆయనను డిప్యూటేషన్‌పై ఒంగోలు పంపించారు.

ఎన్నికల కోడ్‌కు మందు ఎన్నికల కమిషన్ డిప్యుటేషన్ రద్దు చేయడంతో అప్పటి ఏఎన్ఎం విషయంలో తనకు మద్దతు ఇవ్వలేదని మిగతా ఏఎన్ఎంలను మళ్లీ వేధింపులకు గురిచేస్తున్నారు. పైగా బూతులు తీడుతూ జిల్లా అధికారులకు చెప్పినా నన్ను ఏమీ పీకలేరని, ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ వేధిస్తున్నారని ఏఎన్ఎంలు వాపోతున్నారు. వారం క్రితం ఈ విషయంపై జిల్లా వైద్యశాఖ కార్యాలయ సూపరిటెండెంట్‌కు ఫిర్యాదు చేసినా నేటికీ చర్యలు తీసుకోలేదు. దీంతో ఏఎన్ బుధవారం ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో ఇన్‌చార్జిని కలిసి తమ ఇబ్బందులు వివరించారు. అనంతరం వారికి వినతిపత్రం అందజేశారు. తక్షణమే బూతుల డాక్టరుపై చర్యలు తీసుకోవాలని వారు అందులో కోరారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

మార్కాపురం, ఆగస్టు 14: స్వాతంత్ర్య వజ్రోత్సవాల వేళ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. మార్కాపురంలో పలు శాఖలకు చెందిన అధికారులు బుధవారం సాయంత్రం పట్టణంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈ.కిరణ్, తహసీల్దార్ చిరంజీవి, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్, మున్సిపల్ డీఈ సుభాని, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సమైక్యత, సమగ్రత మనందరి బాధ్యత

కంభం, ఆగస్టు 14 : భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని కంభం పట్టణంలోని స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వి.సైమన్‌విక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత స్వాతంత్ర్య నేపథ్యం, రాజ్యాంగ రూపకల్పన, ప్రజాస్వామ్యంపై అవగాహన పెంచుకుని బాధ్యతతో మెలగాలన్నారు. పట్టణంలో భారీ ర్యాలీగా వెళ్లి కందులాపురం కూడలిలో జాతీయ జెండాలతో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మస్తాన్‌వలి, ఎంఈవో బి.మాల్యాద్రి, ఈవో ఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి బ్రహ్మయ్య, సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా బిడ్డ భౌతికకాయాన్ని తెప్పించండి

● మృతుడి కుటుంబసభ్యుల వేడుకోలు

● సీఎంవో కార్యాలయంతో మాట్లాడిన గూడూరి


ఎరిక్షన్‌బాబు ఎదుట గోడు వెల్లబోసుకుంటున్న మృతుడి కుటుంబసభ్యులు

పెద్దదోర్నాల,ఆగస్టు 14: మృతిచెందిన మా బిడ్డ భౌతిక కాయాన్ని తెప్పించాలని మండలంలోని హసనాబాద్ గ్రామానికి చెందిన ఒంటేరు చిన్నగురవయ్య కుటుంబ సభ్యులు బుధవారం టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబును స్థానిక కార్యాలయంలో కలిసి కోరారు. హసనాబాద్ గ్రామానికి చెందిన ఒంటేరు శివన్నారాయణ ఉన్నత ఉద్యోగానికై ఆర్మేనియా దేశానికి వెళ్లాడు. అక్కడ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది..అయితే తమ బిడ్డ మృతదేహాన్ని కడసారి చూసుకునేందుకైనా తెప్పించాలని మృతుని కుటుంబసభ్యులు ఎర్రగొండపాలెంలో ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబును కలిసి గోడు వెల్లబోసుకున్నారు. దీంతో స్పందించిన ఎరిక్షన్ బాబు సీఎంవో కార్యాలయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. జరిగిన విషయం సంబంధిత అధికారులకు వివరించారు.శివన్నారాయణ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

వృత్తిపట్ల అంకితభావం ఉన్న వారికి ప్రజల్లో ఆదరణ

పామూరు, ఆగస్టు 14 : వృత్తిపట్ల అంకితభావంతో, నిష్పక్షపాతంగా నిర్వహిస్తే ప్రజల ఆదరణ ఉంటుందని డీఎస్పీ ఎం రామరాజు చెప్పారు. పామూరు సీఐ రామనాయక్ సాధారణ బదిలీలో భాగంగా గుంటూరు జిల్లాకు బదిలీ అయిన నేపథ్యంలో స్థానిక అనిల్‌గార్డెన్ కల్యాణ మండపంలో మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ అధ్యక్షతన మంగళవారం రాత్రి వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎం గంగరాజుయాదవ్, సింగిల్ విండో మాజీ చైర్మన్లు జయరామిరెడ్డి, నారాయణరెడ్డి, యారవ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్, ఉప్పలపాటి హరిబాబు, పాలపర్తి వెంకటేశ్వర్లు, షేక్ ఖాజారహంతుల్లాతో పాటు కనిగిరి సీఐ వెంకటేశ్వరరావు, కనిగిరి పామూరు, సీఎస్‌పురం, పీసీపల్లి, ఎస్ఐలు త్యాగరాజు, ఎం సైదుబాబు, బీ ప్రేమ్‌కుమార్, రమేష్‌బాబు, ఎస్సీ శీనప్ప పాల్గొన్నారు.



బదిలీ అయిన సీఐ రామనాయక్‌ను సన్మానిస్తున్న కూటమి శ్రేణులు

వాగు పోరంబోకు భూమిని పరిశీలించిన తహసీల్దార్

తాళ్లూరు, ఆగస్టు 14 : మండలంలోని సోమవరప్పాడు పరిధిలోని వివాదాస్పద సర్వేనంబర్ 231 భూమిని తహసీల్దార్ పి.శింగారావు బుధవారం పరిశీలించారు. ఆ సర్వే నంబర్ భూమిలో కొంతభాగం పట్టా భూమిగా, మరి కొంత వాగు పోరం బోకుభూమిగా ఉంది. పట్టా ల్యాండ్ విషయమై ఇరువురి మధ్య వివాదం జరిగింది. పట్టా భూమిని ఆనుకుని ఉన్న వాగు పోరంబోకు భూమి ఆక్రమణకు గురైందని సోమవరప్పాడు గ్రామస్థులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన భూమిని పరిశీలించి, సర్వేయర్ చేయించారు. ఆసర్వేనంబర్‌లో231/1లో 2 ఎకరాల 35 సెంట్ల భూమి పట్టాభూమిగా, 231/2,3 నంబర్లందు 2ఎకరాల 36 సెంట్లు వాగు పోరం బోకు భూమిలో కొంతభాగం ఆక్రమణ జరిగినట్లు గుర్తించారు. వాగు పోరంబోకు భూమిలో ఎలాంటి ఆక్రమణలు జరుగకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని వీఆర్‌వోకు సూచించారు. వాగుపోరంబోకు భూమి అనుకుని వివాదంగా ఉన్న పట్టాభూమికి చెందిన భూమిలో అర సెంట్ భూమికి హద్దులు చూపించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ బాబూరావు, వీఆర్‌వో రాఘవరెడ్డి, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శింగారావు

రెవెన్యూ సదస్సులు వాయిదా

పీసీపల్లి, ఆగస్టు 14 : మండలంలో ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం వాయిదా వేసిందని తహసీల్దార్ సీహెచ్ ఉషా చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలతో తిరిగి ఎప్పుడు నిర్వహించేది ప్రకటన రూపంలో తెలియజేస్తామని తెలిపారు. ఈ లోపు ఏవైనా రెవెన్యూ సమస్యలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో తనను సంప్రదించాలని చెప్పారు.

ముగిసిన పంచాయతీ సర్పంచ్‌ల శిక్షణా తరగతులు

ముండ్లమూరు, ఆగస్టు 14 : మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లకు మూడు రోజులపాటు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాలు జరిగాయి. శిక్షణకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ సర్పంచ్‌లు తమ విధులు తెలుసుకొని గ్రామాల అభివృద్ధికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దేవస్థాన ద్వితీయ వార్షికోత్సవం

పామూరు, ఆగస్టు 14 : మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో మహాగణపతి, సుబ్రమణ్యస్వామి, దేవస్థాన ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామాయణ ప్రవచన కర్త కురిమేటి బాలసుబ్రమణ్యం శర్మ పర్యవేక్షణలో యజ్ఞ హోమాలు, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, జీ భాస్కర్‌రెడ్డి, ఎం నగేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ పూజలు

పామూరు, ఆగస్టు 14 : మండలంలోని మోట్రావులపాడు గ్రామంలో శ్రీపోలేరమ్మ పోతురాజు సహిత శిఖర కలశ ప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవం నేటి నుంచి 16వ తేదీ వరకు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు కార్యక్రమాల్లో భాగంగా బుధవారం నుంచి పలుపూజలు ప్రతిష్ఠాచార్యులు ఓరుగంటి సీతారామశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చిన్నారులను చదువుకోనిద్దాం

కనిగిరి, ఆగస్టు 14 : చిన్నారులను పనిలో పెట్టుకోకుండా చదువుకునేలా ప్రోత్సహించి బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (కార్మికశాఖాధికారి) సుబ్బారాయుడు చెప్పారు. పిల్లలకు స్వేచ్ఛ అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో పోలీసుశాఖ, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులతో కలసి ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని కూరగాయలు, రెడిమేడ్, ఫర్నీచర్, వివిధ వ్యాపారససంస్థలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడులూ పుస్తకాలు పట్టుకునే చిన్నారులచే పనిముట్లు పట్టించి పనుల్లో పెట్టుకోవటం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ అధికారులు, సిబ్బంది, గుడ్‌హెల్ప్ రమేష్, ప్రవీణ్, సార్డ్ సంస్థ సలోమి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కార్యదర్శులు చొరవ తీసుకోవాలి

కనిగిరి, ఆగస్టు 14 : గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలని ఎంపీడీవో హనుమంతరావు చెప్పారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం కార్యదర్శులు రీ ఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ ప్రకాశం, ఈఓపీఆర్డీ అన్నమ్మ పాల్గొన్నారు.

వాహన చట్టం నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు

పీసీపల్లి, ఆగస్టు 14 :మోటారు వాహన చట్టాన్ని అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని పీసీపల్లి ఎస్సై రమేష్‌బాబు హెచ్చరించారు. మండలంలోని పీసీపల్లి, పెదయిర్లపాడులో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహన చోదకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

అద్దంకి-శ్రీశైలం బస్సు సర్వీస్ ఏర్పాటు

తాళ్లూరు ఆగస్టు 14 : తాళ్లూరు ప్రాంత ప్రజలకు శ్రీశైలం వెళ్లేందుకు వీలుగా అద్దంకి-శ్రీశైలం బస్సు సర్వీస్‌ను బుధవారం నుంచి ఏర్పాటు చేశారు. ఈసర్వీస్ అద్దంకిలో ఉదయం 6.30 గంటలకు బయలుదేరి ముండ్లమూరు, తాళ్లూరు, తూర్పుగంగవరం, బొద్దికూరపాడు, రాజంపల్లి మీదుగా పొదిలికి 8.30కు చేరుకుని, మధ్యాహ్నం1 గంటకు శ్రీశైలం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణం 2.15గంటలకు బయలు దేరి రాత్రి 9 గంటలకు అద్దంకికి చేరుకుంటుంది. బస్సు సర్వీస్ ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీతోపాటు దర్శి ఇన్‌చార్జి లక్ష్మి తదితరులకు నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

దర్శి, ఆగస్టు 14 : ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగితే శిక్ష తగ్గించే అవకాశం ఉంటుందని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి కె శ్యాంబాబు చెప్పారు. స్థానిక సబ్ జైలును ఆయన బుధవారం పరిశీలించారు. భోజనం, వసతులు ఎలా ఉన్నాయనే విషయాన్ని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సురేష్, వాకా మంజుల, మనోహరమ్మ, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

దొనకొండ, ఆగస్టు 14 : స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. డాక్టర్ సునీత, సిబ్బంది వెంకటేశ్వరమ్మ, రాధిక, నాగమణి, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

కనిగిరి, ఆగస్టు 14 : రోడ్డు విస్తరణకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రంగారావు చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని మహాలక్ష్మమ్మచెట్టు వీధిలోని షాపుల యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీపీవో వివేకానంద, మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి మరింత చేరువ

కనిగిరి, ఆగస్టు 14 : కనిగిరి ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మరింత చేరువ చేసేందుకు కృషి చేద్దామని డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్ చెప్పారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలోని భవిత కేంద్రంలో నూతనంగా డిప్యూటీ డీఈవో కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు దేవిరెడ్డి రామిరెడ్డి, యూవీ నారాయణరెడ్డి, సంజీవి, రాజాల ఆదిరెడ్డి పాల్గొన్నారు.

సాగర్ కాలువలో పడి యువకుడు గల్లంతు

కురిచేడు, ఆగస్టు 14 : మండలంలోని నమశ్శివాయపురం గ్రామానికి చెందిన కేసనపల్లి మరియబాబు(38) బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు సాగర్ కాలువలో పడి గల్లంతయ్యాడు. మరియబాబు ఆటో తోలుతూ జీవిస్తున్నాడు. బుధవారం సాయంత్రం సాగర్ కాలువ వద్ద ఆటో ఆపి కాలువలో దిగాడు. ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. మరియబాబుకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలియడంతో కాలువ వద్దకు ప్రజలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. గజ ఈతగాళ్ళను పిలిపించి కాలువలో వెతికించారు. అయినా ఆచూకీ కనిపించలేదు. కుటుంబసభ్యుల రోదనలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది.

డ్రైనేజీ, రోడ్ల నిర్మాణం చేపట్టాలని వినతి

పామూరు, ఆగస్టు 14 : పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని నేతాజి, అయ్యప్పనగర్ కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డిని కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. పామూరు-పోతవరం రోడ్డులోని నేతాజీనగర్ 1వ లైన్ నుంచి, అయ్యప్పనగర్‌కాలనీ, పీకేఎం టౌన్‌షిప్, శ్రీనివాసనగర్, కొత్త లేఔట్‌లో సుమారు 100కు పైగా నూతన గృహ నిర్మాణాలు జరిగాయి. కాలనీలన్నింటికీ ప్రధాన రహదారి పామూరు-పోతవరం రోడ్డు వర్షాలు కురిసినప్పుడు బురదమయం అవుతుంది. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో డ్రైనేజి, రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి కాలనీవాసుల రహదారి కష్టాలు తీర్చాలని ఈవోకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో వెంగళశెట్టి బాబురావు, పునాటి మల్లికార్జున, వై సూరిబాబులు ఉన్నారు.

శ్రీవారి దేవస్థానానికి ధర్వాజాల ఏర్పాటు


దేవస్థాన సింహద్వారాల ఏర్పాటు కార్యక్రమాల్లో కదిరి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 14 : మండలంలోని శీలంవారిపల్లె, కోవిలంపాడు, సీఎస్‌పురం గ్రామాల కూడలి ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు నిర్మిస్తున్న శ్రీదేవి భూదేవి, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి సింహద్వారం ధర్వాజాలు నిలుపు పూజ కార్యక్రమాల్లో కదిరిబాబురావు సతీమణి రాణి, కుమారుడు భువనేష్‌లు బుధవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చందు శ్రీనివాస్, మాధవీ దంపతులు, కదిరి రమణయ్య, రమణమ్మ దంపతులు పాల్గొన్నారు.

దర్శి డీఎస్పీగా లక్ష్మీనారాయణ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపడుతున్న లక్ష్మీనారాయణ

దర్శి, ఆగస్టు 14 : దర్శి నూతన ఎస్‌డీపీవోగా లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం సీఐడీ విభాగంలో పనిచేస్తున్న ఆయన్ను వారం క్రితం ఇక్కడకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసకుంటామన్నారు. ఈవ్‌టీజింగ్, బెట్టింగ్, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతకు అందరూ సహకరించాలని కోరారు.

జాతీయ స్కిప్పింగ్ జట్టుకు సరస్వతీ బాలికలు

తాళ్లూరు, ఆగస్టు 14 : తాళ్లూరులోని సరస్వతీ హైస్కూల్‌కు చెందిన 10 మంది బాలికలు జాతీయ స్కిప్పింగ్ జట్టుకు 10మంది ఎంపికైనట్లు శ్రీసరస్వతీ విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 10, 11వ తేదీలలో కడపలో ఏపీ రోప్‌స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పి.పూర్ణిమస్పీడ్ స్ప్రిరిట్‌లో మొదటి స్థానం సాధించారు. ఫ్రీస్టైల్‌లో కీర్తి, స్పీడ్ హోప్‌లో సాయి జీవితలు మొదటి స్థానాలు సాధించారు. వారికి మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు. విజేతలైన బాలికలను చైర్మన్ ఏవీ రమణారెడ్డి, హెచ్‌ఎం శ్రీరామమూర్తి, రత్నం, వెంకారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, యాకోబు, వెంకట్రావు, పీఈటీలు వికాస్, శిరీషలు అభినందించారు.

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

వెలిగండ్ల, ఆగస్టు 14 : వెలిగండ్ల మండలం మొగళ్లూరుపల్లి వద్ద ఆర్సీసీ (మోడల్ స్కూల్) బస్సుకు బుధవారం పెనుప్రమాదం తప్పింది. గోగులపల్లి నుంచి విద్యార్థులను ఎక్కించుకొని కనిగిరి మోడల్ స్కూల్‌కు బస్సు వస్తుండంగా, మొగళ్లూరుపల్లి వద్ద ట్రాక్టర్ ఎదురు రావడంతో డ్రైవర్ బస్సును పక్కకు దింపాడు. దీంతో బస్సు పక్కనున్న మట్టిలో కూరుకుపోయింది. విద్యార్థులు ఒక్కసారి కేకలు వేయడంతో బస్సును ఆపి విద్యార్థులను కిందకు దింపడంతో ప్రమాదం తప్పింది.





పెరేడ్ గ్రౌండ్‌లో పోలీసు కవాతును పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

పంద్రాగస్టు ఏర్పాట్లు పూర్తి

- అట్టహాసంగా స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధం
- జెండా పండుగకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబు
- జెండా ఆవిష్కరణకు విద్యుత్ శాఖ మంత్రి రవి



నాడు ఉద్యమ కారులు నల్లూరు లో నిర్మించిన గాంధీ స్థూపం



పేటేరులో స్వాతంత్ర్య సమరయోధులు గుర్తుగా ఏర్పాటు చేసిన స్థూపం

బాపట్ల/ బాపట్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలకు బాపట్లలోని పోలీస్ పరేడ్ మైదానం సిద్ధమైంది. జాతీయ జెండాల రెపరెపలతో ప్రాంగణం ముస్తాబైంది. విద్యుత్ వెలుగుల్లో కలెక్టరేట్‌తో పాటు ఇతర కార్యాలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. గురువారం జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత జరుగుతున్న తొలి జెండా పండుగ కావడంతో అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు ముఖ్య అతిథిగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హాజరు కానున్నారు. ఆయనే జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించనున్నారు. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసే స్టాల్స్‌కు సంబంధించి ఇప్పటికే కలెక్టర్ వెంకటమురళి ఆయా శాఖల అధికారుల కు పలు సూచనలు చేశారు. శాఖల వారీగా ఏర్పాటు చేసే శకటాలపై కూడా బుధవారం మరోమారు అధికారులతో సమావేశమైన ఏర్పాట్ల సన్నద్ధతపై కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలోని రెవెన్యూ, పోలీస్ సహా అన్ని శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికా రులకు ప్రశంసాపత్రాలను అందించనున్నారు.



పేటేరులో గాంధీజీ బస చేసిన భవనం

పరేడ్ గ్రౌండ్‌లో రిహార్సల్స్

పంద్రాగస్టు కవాతు మరింత సుందరంగా నిర్వహించాలని ఎస్పీ తుషార్‌డూడీ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పోలీసు పేరెడ్‌గ్రౌండ్‌లో బుధవారం పరేడ్ రిహార్సల్స్ జరిగాయి. జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించి రిహార్సల్‌ను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎస్పీ తుషార్ డూడీ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్ పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీసు కవాతు రిహార్సల్ నిర్వహించారు. వేడుకలు వీక్షించడానికి విచ్చేసే ప్రజలకు, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగినభద్రతా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ టిపి.విఠలేశ్వర్, ఆర్‌ఐలు డి.శ్రీనివాసరెడ్డి, షేక్.మౌలుద్దీన్ పాల్గొన్నారు.

జిల్లాలో మహాత్ముడి గుర్తులు

రేపల్లె: స్వాతంత్ర్య దినోత్సవానికి పల్లె పట్టణం సిద్ధమవుతుండగా.. జిల్లాలో స్వాతంత్ర్య పోరాటాలు, మహాత్మాగాంధీ పర్యటనలను పలువురు గుర్తు చేసుకుంటున్నారు. స్వాతం త్ర్య పోరాటంలో ప్రజలను చైతన్యవంతం చేసే క్రమంలో నాడు మహాత్ముడు దేశవ్యాప్తంగా పర్యటించారు. ఈ క్రమంలో జిల్లాలోని చెరుకుపల్లి మండలం కావూరులో 1933లో గాంధీ గ్రామస్తులను ప్రత్యేకంగా కలిశారు. గ్రామానికి చెందిన తుమ్మల బసవయ్య, దుర్గాంబ దంపతులు మహాత్మాగాంధీ స్ఫూర్తితో 50 ఎకరాలను వినయాశ్రమం స్థాపనకు అందజేశారు. ఆ సమయంలో వినయాశ్రమంలో అశ్వద్ధ వృక్షాన్ని నాటారు. మహనీయులు నడియాడిన వినయాశ్రమాన్ని పర్యాటక కేంద్రంగా తయారు చేసి యువతకు స్ఫూర్తి నింపేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- స్వాతంత్ర్య ఉద్యమాలకు ఊపిరిలూదిన రేపల్లె మండలం నల్లూరులో గాంధీ పర్యటించారు. ఈ సందర్భంగా నల్లూరువాసులు వంటిపై ఉన్న ఆభరణాలు మహాత్ముడికి విరాళంగా అందించారు. తెనాలికి చెందిన వెంకటప్పయ్య నల్లూరు గ్రామం కేంద్రంగా హిందీతోపాటు ఉద్యమ పాఠాలు నిర్వహించారు. 1934 జనవరి 18న గాంధీ స్థూపం నిర్మించారు. అది నాటి త్యాగాలకు జ్ఞాపక చిహ్నంగా నిలిచింది.
- రేపల్లె మండలం పేటేరులో 1943లో ఆంధ్ర రత్న గోపాలకృష్ణయ్య గ్రంథాలయంలో గాంధీ బసచేసి ఉద్యమకారులను చైతన్య పరిచారు.గాంధీజీ నడయాడిన ప్రాంతంలో గుర్తుగా 1955లో గాంధీ విగ్రహాన్ని అప్పటి స్వాతంత్ర్య సమరయోధులు నిర్మించారు.



కావూరు వినయాశ్రమంలో గాంధీ కుటీరం వద్ద 1933న అశ్వద్ధమొక్క నాటుతున్న మహాత్మాగాంధీ



ప్రస్తుతం కావూరు వినయాశ్రమంలో అశ్వద్ధ వృక్షం

ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన హర్ ఘర్ తిరంగా 3.0 కార్యక్రమంలో భాగంగా కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి పంపిన లేఖను, జాతీయ జెండాను మంగళగిరి సబ్ డివిజన్ పోస్టాఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆర్ రాధాకృష్ణమూర్తి బుధవారం మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. గుంటూరులో జరిగే స్వా తంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన నున్న లోకేశ్‌కు మంగళగిరి తహసీల్దారు ఆహ్వాన పత్రిక ను అందజేశారు. **- తాడేపల్లి టౌన్**





విద్యుత్ కాంతులతో మంగళగిరిలోని ఎయిమ్స్ సముదాయం

బదిలీలకు.. రైట్ రైట్

- నెలాఖరు వరకు నిషేధం సడలింపు
- రేపటి నుంచి వివిధ శాఖల్లో బదిలీల సందడి
- విధివిధానాలను ఖరారు చేసిన సాధారణ పరిపాలనాశాఖ

గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం జూన్‌లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎప్పుడెప్పుడా అని ఉద్యోగులు ఎదురు చూస్తున్న సాధారణ బదిలీలకు అనుమతి వచ్చింది. ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని నెలాఖరు వరకు సడలిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శుక్రవారం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల్లో బదిలీల సందడి ప్రారంభం కానుంది. జిల్లా స్థాయి అధికారులతో పాటు ఆయా శాఖల్లోని సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, క్లాస్-4 ఉద్యోగులు బదిలీ కానున్నారు. కొత్త జిల్లాలు ఏర్పడినప్పటికి రాష్ట్రపతి గజిట్ పబ్లికేషన్ జరగనందున పాత జిల్లా ఆధారంగా ఎవ్వరినీ సొంత జిల్లాలకు బదిలీ చేయొద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2024 జూలై 31 నాటికి ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలి. ఇతర ఉద్యోగులంతా కూడా పరిపాలన సౌలభ్యం దృష్ట్యా బదిలీలకు అర్హులే. ఒక స్టేషన్ అంటే ఆ జిల్లాలో ఏ హోదాలో ఐదేళ్లుగా కొనసాగుతున్నా బదిలీ చేయాల్సిందే. దృష్టి లోపం ఉన్న ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అలానే గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల కంటే ఎక్కువకాలం విధులు నిర్వహిస్తున్న వారికి కూడా ప్రాధాన్యం ఇస్తారు. 40 శాతం, అంతకంటే ఎక్కువ అంగ వైకల్యం ఉన్న వారికి, బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలున్న వారికి కూడా ప్రాధాన్యం ఉంటుంది. మెడికల్ గ్రౌండ్స్ పైనా బదిలీలకు ప్రయార్టీ ఇస్తారు. వితంతువులు, భార్య, భర్త ఒకే ఊరిలో పని చేసేందుకు అవకాశం కల్పిస్తారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్స్(అధ్యక్షుడు, సెక్రెటరి, ట్రెజరర్)లకు బదిలీ నుంచి మినహాయింపు ఉంటుంది. వీళ్లు మూడు సార్లు తొమ్మిదేళ్ల పాటు ఒక స్టేషన్‌లో కొనసాగవచ్చు. అయితే దీనిని అడ్డం పెట్టుకుని గుర్తింపు లేని సంఘాల నాయకులు కూడా బదిలీల నుంచి మినహాయింపు పొందుతున్నారని ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆఫీసు బేరర్స్ అన్న పదాన్ని ఎవరెవరికి వర్తిస్తుందనేది కూడా నిర్వచించాలని కోరుతున్నారు.

విద్యుత్ కాంతుల్లో సచివాలయం

తుళ్లూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజధాని అమరావతి పరిధి లోని వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాల తో అలంకరించారు. జాతీయ జెండా రంగుల విద్యుత్ దీపాల వెలుగు ల్లో బుధవారం రాత్రి సచివాలయం, అసెంబ్లీ భవనాలు కాం తులీనాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆయా భవనాలను పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సచివాలయం ముస్తాబు చేశారు. తిరి గి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో సచివాలయ భవనాలు నూతన శోభను సంతరించుకున్నా యని రాజధాని వాసులు హర్షం వ్యక్తం చేశారు.



కుడి కాల్వకు నీటి సరఫరా కొనసాగింపు

1 నుంచి జోన్ - 2 ఆయకట్టుకు సాగు నీరు

నరసరావుపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడికాల్వ ఆయకట్టుకు నీటి సరఫరాపై జలవనరుల శాఖ స్పష్టత ఇచ్చింది. జోన్-1 ఆయకట్టుకు నీటి సరఫరాను కొనసాగిస్తున్నారు. ఈ ఆయకట్టు పరిధిలో రైతులు వరి సాగు చేసుకోవచ్చని వెల్లడించింది. పమిడిపాడు బ్రాంచి కెనాల్ మినహా జోన్-1లోని పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలోని ఆయకట్టు అంతటకి సాగు నీటి సరఫరా కొనసాగుతోంది. ఒకటో తేదీ నుంచి జోన్-2 ఆయకట్టులోని ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో సాగు నీటిని సరఫరా చేయనున్నారు. ఈ మేరకు జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీరు రవి బుధవారం తెలిపారు. వరి, పత్తి, మిరప తదితర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. నీటిని వృథా చేయకుండా పొదు పుగా పంటలకు వినియోగించుకోవాలని తెలిపారు.

సాగర్‌లో పూర్తి స్థాయికి నీరు

సాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు 7,528 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ డ్యాంలో నీటి మట్టం పూర్తి స్థాయికి అంటే 590 అడుగులకు చేరింది. 312.05 టీఎంసీలకు జలాశయంలో 312 టీఎంసీల నీటి నిల్వ ఉంది. దీంతో డ్యాం క్రస్ట్ గేట్ల మళ్లీ తెరుచుకున్నాయి. బుధవారం డ్యాం రెండు గేట్లను తెరచి దిగువకు 16,200 క్యూసె క్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం ఇన్‌ఫ్లో 63,123 క్యూసెక్కులు కాగా ఆదే స్థాయిలో నీటి విడుదల జరుగుతోంది. బుగ్గవాగు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 2.83 టీఎంసీలకు 0.63 టీఎంసీల నీటి నిల్వ ఉంది. బుగ్గవాగు నుంచి కుడి కాల్వకు 5,095 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాల్వ పరిధిలో ముమ్మరంగా వరి నారు మళ్ల సాగు పనులు జరు గుతున్నాయి. మరో వైపు పత్తి, మిరప పంటలను రైతులు సాగు చేస్తున్నారు.



బుగ్గవాగు నుంచి విడుదలవుతున్న నీరు

నేటి నుంచి అన్న క్యాంటీన్లు

గుంటూరులో సౌకర్యాలను పరిశీలించిన మంత్రి నారాయణ



చుట్టుగుంట అన్న క్యాంటీన్ పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రారంభించనున్నారు. గుంటూరు నగరంలో ఏడు క్యాంటీన్లు గురువారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో సిద్ధమైన అన్న క్యాంటీన్‌లోని ఏర్పాట్లు, సౌకర్యాలను బుధవారం మంత్రి పొంగూరు నారాయణ పరిశీలించారు. భవన నిర్మాణం, వడ్డించే ప్రాంతం, వాష్ ఏరియాల వద్ద ఏర్పాట్లపై పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసరావు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో 183 అన్న క్యాంటీన్లు ప్రారంభించగా వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసి పేదల పొట్టకొట్టిందన్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామన్నారు.

ఆక్టోపస్ ఏఎస్పీకి ఇండియన్ పోలీస్ మెడల్



తాడేపల్లి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుని కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఆక్టోపస్ ఏఎస్పీ కే రామచంద్రమూర్తిని ఎంపిక చేసింది. 2020 నుంచి వడ్డేశ్వరంలోని ఆక్టోపస్‌లో కార్యాలయంలో ఆయన విధులు నిర్వహిస్తున్నారు. 1991లో ఆర్ఎస్ఐగా విధుల్లో చేరి 2009లో అసిస్టెంట్ కమాండెంట్‌గా 2020లో అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతులు పొందారు. గతంలో డిచ్‌పల్లి 7వ పటాలం, కొండాపూర్ 8వ పటాలం కాకినాడ 3వ పటాలం, మంగళగిరి 6వ పటాలంలో వివిధ హోదాల్లో ఆయన సేవలు అందించారు. 2004 నుంచి 2007 వరకు గ్రే హౌండ్స్, 2017 నుంచి 2020 వరకు స్టేట్ ఆర్మ్ ఇన్‌స్పెక్షన్ అథారిటీలో అత్యుత్తమ సేవలు అందించారు. 2012లో రామచంద్రమూర్తి సేవలకు గుర్తింపుగా ఏపీ పోలీస్ సేవా సంఘం సర్వీసులో 8 క్యాష్ రివార్డులు, 38 గుడ్ సర్వీస్ ఎంట్రీ, 25 అప్రియేషన్స్, 28 కమెంటేషన్స్, గోదావరి కృష్ణా పుష్క రాలలో 3 ప్రశం సాపత్రాలు పొందారు. రామచంద్రమూర్తికి ప్రతిష్ఠాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ లభించం డంపై పోలీసు, ఆక్టోపస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- గున్యాతో అందరికీ నొప్పులు
- ముక్తేశ్వరం, కూకట్లపల్లి యానాది సంఘంలో పెద్ద ఎత్తున రోగులు
- కోలుకుంటున్న అంబడిపూడి
- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- పడకేసిన పారిశుధ్యం
- కనిపించని వైద్య శిబిరాలు
- ఆందోళనలో ప్రజలు


ముక్తేశ్వరంలో విష జ్వరాలతో మంచం పట్టిన కుటుంబం.. గున్యాతో బాధపడుతున్న వృద్ధురాలు

బల్లికురవ, ఆగస్టు 14 : గ్రామాలలో రోజు రోజుకు జ్వరాలు విజృంభిస్తున్నాయి. పారిశుధ్య లోపంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గత నెలలో అంబడిపూడి గ్రామాన్ని చికున్ గున్యా, విషజ్వరాలు పీడించగా ఇప్పుడు పలు గ్రామాలకు వ్యాప్తి చెందుతున్నాయి. తాజాగా ముక్తేశ్వరం, కూకట్లపల్లి యానాది సంఘంలో నాలుగు రోజుల వ్యవధిలోనే విష జ్వరాలు గున్యా నొప్పులతో ప్రజలు అల్లాడుతున్నారు. జ్వరం ఇంటిలో ఉన్న వారందరికీ వస్తుందని ఎవరు కదల లేని స్థితిలో ఉంటున్నారని వాపోతున్నారు. ఏటా వర్షాకాలంలో ఇలాంటి జ్వరాలు వస్తున్నాయని గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా చేయడం లేదని, ఎదో మమ అంటు పైపైన వ్యర్థాలను తీసి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన వీధులలో చిన్న పాటి వర్షాలు కురిస్తే మురుగు కాలువల్లో మురుగు రోడ్లపైకి వస్తుందని దీంతో దోమల బెడద కూడా అధికమవుతుందని ప్రజలు తెలిపారు. మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో గత మూడు రోజుల వ్యవధిలోనే 50 మంది వరకు జ్వరాల బారిన పడి మంచాలను పట్టారు. జ్వరాన పడిన వారి కీళ్లు పట్టుకు పోతున్నాయని తీవ్ర నొప్పులతో నడవలేక మంచానపడుతున్నామని చెప్తున్నారు. గ్రామంలోని ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సి వస్తుందని అక్కడి ప్రజలు తెలిపారు. కొందరు జ్వరాలను చూసి భయపడి పట్టణ ప్రాంతాలకు వెలుతున్నారన్నారు. సీజనల్ జ్వరాలు గ్రామాలలో అధికంగా ఉన్నాయని వైద్య ఆరోగ్య శాఖ సరిగా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరాలు వచ్చిన గ్రామాలలో శిబిరాలను ఏర్పాటు చేసి అదుపులోకి వచ్చే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ నిధులతో వెంటనే విష జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలని లేకుంటే ముందు ముందు తీవ్రత పెరిగే అవకాశముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు


ఇంటి ముందు నిలిచి ఉన్న మురుగు


చిల్లకంపను తొలగిస్తున్న జనకవరం గ్రామస్థులు

చిల్లకంప తొలగింపు

పంగులూరు, ఆగస్టు 14 : మండల కేంద్రమైన పంగులూరులోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం మధ్య దట్టంగా పెరిగిన చిల్ల కంపను సచివాలయం - 2 పరిధిలోని జనకవరం గ్రామస్థులు స్వచ్ఛందంగా తొలగించే పనులు చేపట్టారు. టీడీపీ నాయకుడు, జనకవరం గ్రామానికి చెందిన గుర్రం ఆదిశేఖర్ 15 మంది కూలీలతో పంగులూరులోని రెవెన్యూ కార్యాలయం, సచివాలయం - 2, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్, వెలుగు కార్యాలయాల మధ్య పరిసరాలలో పెరిగిన చిల్ల కంపను తొలగించి శుభ్రం చేయించారు. ఆదిశేఖర్‌ను పలువురు అభినందించారు.

ముగిసిన సర్పంచ్‌ల శిక్షణ

పంగులూరు, ఆగస్టు 14 : గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శుల మూడురోజుల శిక్షణ బుధవారంతో ముగిసింది. గ్రామాలలో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, పరిశీలన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజనేయులు ఈవోఆర్డీ రాంబాబు, రమేష్‌బాబు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఎల్‌వోల సమస్యలపై స్పందించిన మంత్రి

కలెక్టర్‌కు వివరించిన గొట్టిపాటి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 14 : బీఎల్‌వోలకు 2024 ఎన్నికలల్లో విధులు నిర్వహించిన వారికి వేతనాలు చెల్లింపులకు సంబంధించిన సమస్యలపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఏపీజీఎస్‌డబ్ల్యూఎస్‌వో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాము కలిసి వివరించారు. స్పందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెంటనే కలెక్టర్ వెంకట మురళికి విషయాన్ని వివరించారు. దీంతో బుధవారం అధ్యక్షుడు రాము, ఏబేలు, రేణుతోపాటు పలువురు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. 2024 ఎన్నికలల్లో విధులు నిర్వహించిన బీఎల్‌వోలకు రావాల్సిన గౌరవ వేతనాలను గురించి వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంకట మురళి సమస్యను పరిష్కరించేందుకు తగిన ఆదేశాలు ఇస్తామని తెలిపారని నాయకులు రాము తెలిపారు. దీని వలన జిల్లాలోని 2వేల మంది బీఎల్‌వోలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సమస్యపై వెంటనే స్పందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంపీడీవోగా నేతాజీ బాధ్యతల స్వీకరణ


శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

చీరాలటౌన్, ఆగస్టు 14 : చీరాల ఎంపీడీవోగా నేతాజీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చీరాలలో రెగ్యులర్‌గా పని చేస్తు న్న నేతాజీ ఎన్నికల విధుల కోసం బాపట్ల మండలం కర్లపాలెంకు వెళ్లారు. అనంతరం తిరిగి ఇక్కడ బాధ్యతలు స్వీకరించగా, శోభారాణిని పల్నాడు జిల్లా దాచేపల్లికి బదిలీ చేశారు. నేతాజీకు కార్యాలయ సిబ్బంది ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. మండల అభివృద్ధికి కలిసి పనిచేయాలని ఎంపీడీవో కోరారు.

ఇంకొల్లు ఎంపీడీవోగా రాజ్యలక్ష్మి

ఇంకొల్లు, ఆగస్టు 14 : ఇంకొల్లు ఎంపీడీవోగా రాజ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన శ్రీదేవి బదిలీ అయ్యారు. రాజ్యలక్ష్మి ఎన్నికల సమయంలో రాజ్యలక్ష్మి ఇక్కడి నుంచి బదిలీ కాగా తిరిగి బాధ్యతలు స్వీకరించారు.

జె.పంగులూరుకు రామాంజనేయులు



పంగులూరు, ఆగస్టు 14 : జె.పంగులూరు ఎంపీడీవోగా బి.రామాంజనేయులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రామాంజనేయులు నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తిరిగి జె.పంగులూరుకు నియమితులయ్యారు.

ఎన్ఆర్‌జీఎస్ పనులపై సమీక్ష

పంగులూరు, ఆగస్టు 14 : పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్‌జీఎస్, హౌసింగ్ సిబ్బందితో ఎంపీడీవో రామాంజనేయులు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ పనిదినాలు, హార్టీకల్చర్, షెల్ఫ్ ఆఫ్ వర్క్‌పై చర్చించారు. కార్యక్రమంలో గ్రామీణ ఉపాధి పథకం క్షేత్ర సహాయకులు, గృహ నిర్మాణ సిబ్బంది పాల్గొన్నారు.

కొరిశపాడు ఎస్ఐగా సురేష్



మేదరమెట్ల, ఆగస్టు 14 : మండలంలోని కొరిశపాడు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఉన్న ఎస్ఐ శివయ్య బట్టిప్రోలుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు, చట్ట వ్యతిరేక పనులు చేసేవారిపై కఠినంగా వ్యహరిస్తామని హెచ్చరించారు. మండలంలోని ప్రజలు సమస్యలపై తనను స్టేషన్‌లో కలవవచ్చన్నారు.

గులాబీ పురుగును నివారించుకోవాలి


పత్తి పైరును పరిశీలిస్తున్న ఏడీఏ మోహనరావు

పర్చూరు, ఆగస్టు 14 : ప్రత్తి పంటలో గులాబీ పురుగును తొలిదశలో గుర్తించి నివారణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు వస్తాయని పర్చూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.రామమోహనరావు అన్నారు. బుధవారం మండలంలోని గొల్లపూడి గ్రామంలో రైతులు సాగుచేసుకున్న ప్రత్తి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులను ఉద్దేశించి ఏడీఏ మాట్లాడుతూ ప్రత్తి పైరులో గులాబీ పురుగు వచ్చే ప్రమాదం ఉందని, దీనిపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పురుగును తొలిదశలో గాని, పూతదశలో గాని నివారించుకోవాలని తెలిపారు. పురుగు గుడ్డు దశలో ఉన్నప్పుడు వేప గింజల కషాయాన్ని కానీ, ప్రొఫ్ నోఫాస్ 2ఎంఎల్/లీటరు లేదా తయడికర్బ్ 1.5 గ్రామ్ కానీ పిచికారీ చేయాలన్నారు. దీంతోపాటు ఎకరానికి 6 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకొని పురుగు ఉధృతిని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.


గోశాలకు దాతలు పంపిన వరిగడ్డి

గో మేతకు దాతల వెల్లువ

అద్దంకి, ఆగస్టు 14 : అద్దంకిలోని హరిహర గోకులంలో ఉన్న ఆవుల ఆకలి తీర్చేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. ఇప్పటికే పలువురు నగదు అందజేయగా, బుధవారం మరికొందరు దాతలు ముందుకు వచ్చి సహాయం అందజేశారు. అద్దేపల్లి అశోక్ రూ.50,116, పీఎస్ఎస్ కోటేశ్వరరావు రూ.7,500, కొప్పురావూరి రమ బ్రహ్మం రూ.2వేలు, నాగసూరి సుబ్బారావు తన మనవుడు పుట్టిన రోజు సందర్భంగా రెండు ట్రాక్టర్‌ల పచిగడ్డిని అందజేశారు. అద్దంకి పట్టణంలో నివాసం ఉంటున్న రాజస్థాన్ యువకులు గోవుల మేతకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నాగసూరి సత్యనారాయణ సుమారు 16 వేల రూపాయల విలువైన వరిగడ్డి ని అందజేశారు. ఆవుల మేత కు సహకరిస్తున్న దాతలకు గోశాల నిర్వాహకుడు సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు.

మానసిక ఎదుగుదల లేని పిల్లలకు సాయం



మాట్లాడుతున్న ఎంఈవో సుధాకరరావు, న్యాయవాదులు

అద్దంకిటౌన్, ఆగస్టు 14 : మానసిక ఎదుగుదల లేని పిల్లలకు చట్టాలలో న్యాయపరంగా ఎన్నో వెసులుబాటులు ఉన్నాయని వాటిని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఎంఈవో బూదాటి సుధాకరరావు అన్నారు. బుధవారం అద్దంకిలోని సత్రంబడిలోని భవిత కేంద్రాంలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు హెచ్ఎం ఇ.రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న న్యాయవాదులు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ మానసిక వైకల్యం ఉన్న వారికి న్యాయ సాయాన్ని న్యాయ సేవా అధికార సంస్థ అందిస్తుందన్నారు. మరో న్యాయవాది మర్తా శ్రీనివాసరావు చిన్నారుల తల్లిదండ్రులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు కొంగల శ్రీనివాస్, పాలపర్తి యోనా, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

బల్లికురవ, ఆగస్టు 14 : గ్రామాలలో సీజనల్ వ్యాధులు రాకుండా నిరంతరం పారిశుధ్య పనులు చేయించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో శానిటేషన్, చెత్త సంపద కేంద్రాల వినియెగంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, కార్యదర్శులతో రాంబాబు మాట్లాడుతూ వ్యక్తి గత పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాలువల్లో వ్యర్థాలను తొలగించి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ శిక్షణలో ఈవోపీఆర్డీ సుమతి పాల్గొన్నారు.

రేపు అన్న క్యాంటీన్ ప్రారంభం

సర్వత్రా హర్షం



ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్

చీరాల, ఆగస్టు 14 : హైస్కూల్ రోడ్డులో గతంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అన్న క్యాంటీన్ తమకు ఎంతో ఉపయోకరంగా ఉంటుందని పేద ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల మధ్య అల్పాహారంతో ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించినట్లు మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి తెలిపారు. బుధవారం క్యాంటీన్‌కు సంబంధించిన తుది మెరుగులను పూర్తి చేశారు. ప్రభుత్వ నిధులు రూ.5 లక్షలు, మున్సిపల్ సాధారణ నిధులు రూ.4లక్షలు మొత్తం రూ.9లక్షల వ్యయంతో అన్ని వసతులతో అన్న క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధమైంది. క్యాంటీన్ లోపల ఒడ్డనకు, తినేవారికి సదుపాయంగా ఉండేవిధంగా వసతి ఏర్పాటు చేశారు. ఇక వెలుపల లాన్, మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడం, అన్న క్యాంటీన్ పునః ప్రారంభించడం పట్ల పేదలతో పాటు అన్ని వర్గాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం జరిగే ప్రా రంభ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి తెలిపారు.


విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

పశు పోషకులకు మెరుగైన సేవలు

విత్తనాల పంపిణీలో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 14 : పశుపోషకులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం రాత్రి పశు కాపరులకు సంబంధించి ఒక్కో కుటుంబానికి 3 కేజీల చొప్పున పశుగ్రాస విత్తనాలను గురువారం నుంచి పంపిణీ చేయనున్నారు. ఆ నేపథ్యంలో ముందస్తుగా కొందరు లబ్ధిదారులకు విత్తనాల కిట్లను ఎమ్మెల్యే కొండయ్య బుధవారం పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశుపోషకులు ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ హనుమంతరావు, వేటపాలెం వైద్యాధికారి పుష్పలత, చల్లారెడ్డిపాలెం డాక్టర్ కృష్ణఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు. పశుపోషకులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

ఇంకొల్లు, ఆగస్టు 14 : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు జరిగే ప్రత్యేక తనిఖీలలో భాగంగా ఇంకొల్లులో బుధవారం డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్, లేబర్ ఆఫీసర్ ఆర్.అబ్రహం ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించి బాలకార్మిక వ్యవస్థపై యజమానులకు అవగాహన కలిగించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలలో యాక్సెస్ టు జస్టిస్ జిల్లా కోఆర్డినేటర్ కిషోర్, కానిస్టేబుల్ ఏడుకొండలు, సిఫార్డు సంస్థ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

హెచ్ఐవీపై అవగాహన పెంచాలి

మార్టూరు, ఆగస్టు 14 : ప్రాణాంతకమైన హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనలో యువత కీలకంగా భాగస్వామ్యం కావాలని ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి రాష్ట్ర కోఆర్డినేటరు డాక్టరు రాజేంద్రప్రసాద్ అన్నారు. హెచ్ఐవీపై యువతకు అవగాహన కల్పించాలని, ఈ వ్యాధి నిర్మూలనకు యువత కృషి చేయాలన్నారు. ఏపీ హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో రాష్ట్రంలో మీకు తెలుసా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బుధవారం లింక్ వర్కర్సు చైల్డ్ ఫండ్ ఇండియా, మార్టూరు హెల్త్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రీహర్షిణి కాలేజీలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టరు రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మరో ముఖ్య అతిథి జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలన యువత చేతిలోనే ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టరు ప్రోగ్రాం మేనేజరు జానీషా, రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీరామ్ శ్రీనివాస్, శ్రీహరి, దుర్గ, ఎస్‌కే సల్మా, రూతు, మేనేజర్ డీ స్వరూప్, కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు పర్చూరులో అన్నదానం

పర్చూరు, ఆగస్టు 14 : జనసేన పార్టీ అధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు ప్రవాసాంధ్రులు మన్నెం శ్రీకాంత్‌తోపాటు, ఇతర దాతల సహకారంతో డొక్కా సీతమ్మ పేరుతో అన్న ప్రసాద కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జనసేన నాయకులు బుధవారం ప్రకటనలో తెలిపారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి


మువ్వన్నెల జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


120 అడుగుల జాతీయ జెండాతో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

మేదరమెట్ల, ఆగస్టు 14 : స్వాంత్ర్య సమరయోధుల త్యాగాలను అందరూ స్మరించుకోవాలని రాదాస్ గీతం పాఠశాల ప్రిన్సిపాల్ రాధా అన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బుధవారం మేదరమెట్లలో విద్యార్థినీవిద్యార్థులో ర్యాలీ నిర్వహించారు. జాతీయ నాయకుల వేషధారణతో జెండాలను చేతపట్టి విద్యార్థులు ఆకట్టుకున్నారు. జెండా రూపకర్త పింగళి వెంకయ్య గురించి వివరించారు. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. జై జవాన్, జై కిసాన్, వందేమాతరం నినాదాలతో ర్యాలీ సాగింది.

జాతీయ జెండాలు పంపిణీ

అద్దంకిటౌన్ : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. బుధవారం అద్దంకిలోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు, స్థానికులకు జెండాలు పంచినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. అలాగే నర్రావారిపాలెంకు చెందిన చాటకొండ మధుసుధన్‌రావుకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా, రోటరీ క్లబ్ సభ్యుల చొరవతో మేదరమెట్ల గ్రామానికి చెందిన దేవరకొండ రాజా రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళిసుధాకరరావు, చిన్ని మురళీకృష్ణ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు, జ్యోతి చంద్రమౌళి, సందిరెడ్డి శ్రీనివాసరావు, కొల్లా భువనేశ్వరి, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

120 అడుగుల జెండా ప్రదర్శన

మార్టూరు : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మార్టూరు సెంటర్లో శ్రీహర్షిణి స్కూలు విద్యార్థులు 120 అడుగుల పొడవు గలిగిన జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. స్కూల్ నుంచి మువ్వెన్నెల జెండాను విద్యార్థులు చేతబూని ఊరేగింపుగా ప్రధాన సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెద్ద అండర్ పాస్ వద్ద జెండాతో మానవహారంగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం అంజనేయులు, పద్మ, నీలిమ శ్యామల, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. జాతీయ జెండా ప్రదర్శనను తిలకించిన ప్రజలు పరసించిపోయారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో సత్ఫలితాలు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 14 : రైతులు తాము సాగు చేసే పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని ఏవో కాశీవిశ్వనాథ్ అన్నారు. మండల పరిధిలోని దేశాయిపేట-2 రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ పంటకాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జి. కావ్య, ఎస్‌కే రూఫియా, రైతులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తవ్వితే చర్యలు

ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి



ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

చీరాలటౌన్, ఆగస్టు 14 : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళశారం రాత్రి జోరుగా మండల పరిధిలో అక్రమ రవాణా సాగింది. ఈ విషయం సోషల్ మాధ్యమాలలో వైరల్ కావడంతో కలెక్టర్ ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో చీరాల మండల పరిధిలోని బోయినవారి పాలెం, తోటవారి పాలెం ప్రాంతాలలో జరుగుతున్న అక్రమ తవ్వకాలను ఎస్ఈబీ సీఐ కర్తతో కలిసి ఆర్డీవో పరిశీలించారు. వీటిపై ఆయా పరిధిలోని వీఆర్వో, సచివాలయ సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. అంతేకాకుండా స్థల యజమాలను పిలిపించి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తుది నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రేపు అన్న క్యాంటీన్ ప్రారంభం

మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరు

అద్దంకి, ఆగస్టు 14 : అద్దంకిలో అన్న క్యాంటీన్ తిరిగి ప్రారంభం కానుంది. శుక్రవారం ఉదయం మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన అన్న క్యాంటీన్‌ను జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మూసివేయించారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా మూసివేసిన అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభిస్తుంది. పేదల కడుపు నింపాలన్న ఆలోచన కార్యరూపం దాల్చింది. అద్దంకి పట్టణంలో మూతపడిన అన్న క్యాంటీన్‌లో ఇప్పటివరకు నిర్వహించిన మహిళా మార్ట్‌ను ఖాళీ చేయించి సుమారు రూ.10లక్షలతో మరమ్మతులు చేసి పేదలు భోజనం చేసే వసతితో ఫర్నిచర్ సమకూర్చారు. గురువారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ బాపట్లలో జరిగే స్వాతంత్ర్య వేడుకలలో పాల్గొనుండడంతో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవాన్ని శుక్రవారం చేస్తారు. ప్రతి రోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజన వసతిని అందిస్తారు. తిరిగి అన్న క్యాంటీన్‌లు తెరవడంపై పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

సహకరించని అధికారులు, సిబ్బందిని ఉపేక్షించేది లేదు : మంత్రి రవి

వార్డులలో ప్రాధాన్యత కల్పించాలి : గొట్టిపాటిని కోరిన కౌన్సిలర్లు



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కౌన్సిలర్లు

అద్దంకి, ఆగస్టు 14 : అద్దంకి పట్టణంలోని అన్ని వార్డులలో సమానంగా అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామని, కౌన్సిలర్‌లు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి రవికుమార్‌ని అద్దంకి మున్సిపల్ కౌన్సిలర్ లు బుధవారం కలిసారు. పట్టణంలోని ఆయా వార్డులలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. అదే సమయంలో ఆయా వార్డులలో కౌన్సిలర్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అద్దంకి పట్టణాభివృద్ధికి త్వరలో నిధులు మంజూరు చేయిస్తామని, అన్ని వార్డులకు ఎలాంటి తేడాలు లేకుండా నిధులు కేటాయిస్తామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఆయా వార్డులలో కౌన్సిలర్‌కు ప్రాధాన్యత ఉండే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. అద్దంకి మున్సిపాలిటీలో అధికారులు, సిబ్బంది పనిచేయక పోతే ఉపేక్షించాల్సిన పనిలేదని, వెంటనే బదిలీపై వెళ్లాల్సిందేనని మంత్రి అన్నట్లు తెలిసింది. త్వరలో జరిగే బదిలీలలో పనిచేయని అధికారులు, సిబ్బంది బదిలీపై వెళ్లాలని చెప్పకనే చెప్పినట్లు అయింది. అధికార మార్పిడి వ్యవహారం ఒకరిద్దరు కౌన్సిలర్‌లు మంత్రి రవికుమార్ దృష్టికి చెప్పేందుకు తటపటాయిస్తుండగా, విషయం చెప్పమని అడగడంతో మనసులో మాట చెప్పినట్లు తెలుస్తుంది. రాష్ట్ర స్థాయిలో తీసుకునే నిర్ణయం అయినందున కొంతకాలం వేచి ఉండాలని, ముందు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలుస్తుంది. మంత్రిని కలిసిన వారిలో కౌన్సిలర్‌లు కంపా రజని, మాగులూరి తిరుపతమ్మ గోపి, సీత మ్మ, రంగిశెట్టి సుభాషిణి లహరి, అత్తులూరి రమేష్, విజయలక్ష్మి మాదవరావు, జహీరా జిలాని, ఏజెండ్ల నాగరాజు, అంకం నాగరాజు ఉన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

ప్రజలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జెండా పండుగను ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎంతో మంది మహనీయుల త్యాగ ఫలితంగానే మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు.

గ్రానైట్ కార్మికుడి మృతిపై కేసు

బల్లికురవ, ఆగస్టు 14 : మండలంలోని వేమవరం గ్రామ సమీపంలో ఉన్న శ్రీ వెంకట పద్మజ గ్రానైట్ ఫ్యాక్టరీ పనులు చేస్తు ప్రమాదంలో కార్మికుడు రాజు (20) మృతిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. వేమవరం గ్రామ పరిధిలో ఉన్న శ్రీ వెంకట పద్మజ గ్రానైట్ ఫ్యాక్టరీలో మంగళవారం రాత్రి రాజస్థాన్‌కు చెందిన కార్మికుడు రాజు ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. చైన్ తెగి రాయి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీఆర్వో పూర్ణిమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రచెరువులో వ్యక్తి మృతదేహం

మార్టూరు, ఆగస్టు 14 : మండల పరిధిలో నాగరాజుపల్లి ఎర్ర చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు బుధవారం మార్టూరు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ విషయమై సమాచారం అందడంతో రాత్రి 8 గంటల సమయంలో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అయితే చెరువు లోపలి ప్రదేశం బురదగా ఉండడంతో మృతదేహాన్ని అక్కడి నుంచి బయటకు తరలించడానికి పోలీసులు ఎంతో ఇబ్బంది పడ్డారు. చనిపోయిన వ్యక్తి ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. ఏఎస్ఐ మహమ్మద్ బాషా మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వెల్లలచెరువులో యువకుడి ఆత్మహత్య

సంతమాగులూరు, ఆగస్టు 14 : మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. సంతమాగులూరు ఎస్ఐ పీ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హెన్స్‌కుమార్ (30) వెల్లలచెరువు రైల్వేస్టేషన్‌లో పని చేస్తున్న అన్న ఇంటికి వచ్చారు. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన యువకుడు బుధవారం అడవిపాలెం సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పిల్లల పెంపకంలో శ్రద్ధ తీసుకోవాలి



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

ఇంకొల్లు, ఆగస్టు 14 : పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని, వారిని ఎప్పటికప్పుడు గమనిస్తూ చదువుపై ఆశక్తి పెంచేలా జాగ్రత్తలు తీసుకోవాలని పలువరు ప్రముఖులు సూచించారు. మండలంలోని వంకాయలపాడులోని సాయిరాం స్కూల్‌లో మేడూరి సత్యనారాయణ రచించిన పిల్లల పెంపకం గ్రంథాన్ని డాక్టర్ కొర్రపాటి సుధాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాయిరాం స్కూల్ డైరెక్టర్ తోటకూర విజయభాస్కర్, విద్యావేత్త సీప ప్రసాద్, మేడూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో టీడీపీ పాగా...

ఒంగోలులో వైసీపీకి భారీ షాక్

ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో భారీగా చేరిక

మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ బుజ్జి తెలుగుదేశంపార్టీలోకి

అదే దారిలో మరి కొంతమంది వైసీపీ కార్పొరేటర్లు

తూర్పునాయుడుపాలెంలో చేరికలు

పూర్తి మెజారిటీతో కార్పొరేషన్‌పై కూటమి పట్టు

రెండు, మూడు రోజుల్లో సీఎం చంద్రబాబుకు పరిచయం

ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ టీడీపీ కైవసమైంది. వైసీపీకి చెందిన మెజారిటీ కార్పొరేటర్లు వరుసగా పార్టీలోకి క్యూకట్టారు. చాలావరకు అధికారపార్టీకి జైకొట్టారు. మేయర్, డిప్యూటీ మేయర్ కూడా సైకిలెక్కారు. దీంతో కార్పొరేషన్‌పై కూటమికి పట్టు దొరికింది. బుధవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్వగ్రామం తూర్పునాయుడుపాలెంలో ఈ మేరకు వారంతా సమావేశమై అభివృద్ధికి సహకరిస్తామని ప్రకటించారు. మేయర్‌తో సహా అందరూ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మెజార్టీ కార్పొరేటర్లు మారడంతో ఇక కార్పొరేషన్ పగ్గాలు టీడీపీ చేతికొచ్చినట్లే..



జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరిన మేయర్, డిప్యూటీ మేయర్, కౌన్సిలర్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 14 : ఒంగోలులో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు సైకిలెక్కారు. నగర ప్రథమ పౌరురాలు, మేయర్ గంగాడ సుజాతతోపాటు, డిప్యూటీ మేయర్ వేమూరి వెంకట సూర్యనారాయణ(బుజ్జి)తోపాటు మరి కొంత మంది టీడీపీలో చేరారు. బుధవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సొంతూరు తూర్పునాయుడుపాలెంలో ఆయనను కలిసిన వారు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాగా ఎన్నికలకు ముందు ఐదుగురు కార్పొరేటర్లు టీడీపీలో చేరగా, ఎన్నికల ఫలితాల అనంతరం మరో ఏడుగురు చేరారు. ఇదిలా ఉంచితే కొద్దిరోజులుగా మేయర్ చేరికపై అనేక అనుమానాలు తలెత్తాయి. పార్టీలో చేరతారని సంకేతాలు వచ్చినప్పటికీ ఢిల్లీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ధర్నాలో ఆమె నేరుగా పాల్గొనడం చర్చనీయాంశమైంది. దాంతో ఆమె చేరికపై పలు అనుమానాలు నెలకొన్నాయి. ఆ తర్వాత ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని ఒంగోలులో, ఆ తర్వాత ఎమ్మెల్యే దామచర్లను హైదరాబాద్‌లో, ఒంగోలు రెండుసార్లు కలవడం చర్చనీయాంశమైంది. కొద్దిరోజులుగా మేయర్ చేరికపై దోబూచులాట కొనసాగగా, ఎట్టకేలకు ఉత్కంఠకు తెరపడింది. ఈ మేరకు దామచర్ల సమక్షంలో బుధవారం టీడీపీలో చేరి ప్రజల్లో నడుస్తున్న చర్చలకు మేయర్ గంగాడ సుజాత ఫుల్‌స్టాప్ పెట్టింది. కొద్దిరోజుల క్రితం వరకు ఒంగోలు కార్పొరేషన్ వైసీపీ మెజారిటీ సభ్యులతో పాలకవర్గం కొనసాగగా, బుధవారంతో టీడీపీ కూటమి కైవసం చేసుకుంది. కార్పొరేషన్‌ను పగ్గాలు టీడీపీలోకి తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మొదటి నుంచి పక్కా ప్రణాళికలతో అటు పార్టీశ్రేణుల అభిప్రాయాలను తీసుకున్నారు. అలాగే వైసీపీ కార్పొరేటర్లు చేరిక వల్ల ఎటు వంటి ఇబ్బంది రాకుండా చూస్తానంటూ టీడీపీ శ్రేణులకు భరోసా కూడా కల్పించారు. మొత్తంగా కొద్దిరోజులుగా చర్చనీయాంశంగా మారిన వైసీపీ కార్పొరేటర్ల చేరిక ఎపిసోడ్‌కు బుధవారంతో తెరపడింది. ఇప్పటికే మేయర్, డిప్యూటీ మేయర్‌తోపాటు పదిహేడు మంది టీడీపీలో చేరగా, మరో ఐదుగురు వైసీపీ కార్పొరేటర్లు రెండు రోజుల్లో చేరనున్నట్లు సమాచారం.

అభివృద్ధికి నిర్వచనం దామచర్ల.. అందుకే టీడీపీలోకి: మేయర్

ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిని చూశాం. అభివృద్ధి, సంక్షేమం చేయడంలో దామచర్ల కృషి అభినందనీయం నగర అభివృద్ధి కోసం దామచర్లతో కలిసి పనిచేయాలన్న లక్ష్యంతోనే తనతోపాటు మరి కొంతమంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరాము. ఇంకా ఎన్నో సమస్యలు పెండింగ్ ఉన్నాయి. పోతురాజు కాలువ ఆధునీకీకరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోజు తాగునీటి సరఫరాతోపాటు, కార్పొరేషన్ కార్యాలయానికి సొంత భవనం అవసరం ఉంది. ఎమ్మెల్యే సహకారంతో వాటిని సాధించుకోగలమనే నమ్మకం ఉంది.

కార్పొరేషన్ కైవసం చేసుకున్న టీడీపీ

నగరంలో మొత్తం 50 డివిజన్‌లు ఉండగా, ఆరుగురు టీడీపీ కార్పొరేటర్లు ఉన్నారు. వారితోపాటు జనసేన కార్పొరేటర్ ఒకరు ఉండటంతో వారి సంఖ్య ఏడుకు పరిమితమైంది. అయితే ఓ కార్పొరేటర్ ఇండిపెండెంట్‌గా గెలుపొంది అప్పట్లో వైసీపీ కండువా కప్పుకున్నారు. దీంతో వైసీపీ సభ్యుల సంఖ్య 43 ఉండగా, కౌన్సిల్ సమావేశంలో వారిదే పైచేయిగా ఉండటంతోపాటు, అజెండాలో పొందుపరిచిన ప్రజావ్యతిరేక అంశాలపై ప్రతిపక్షం టీడీపీ అడ్డుపడినా, అభ్యంతరాలు తెలియజేసినా తీర్మానాలను ఏకపక్ష ఆమోదించారు. కాగా 2024 సాధారణ ఎన్నికల ఫలితాల అనంతరం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. తదనంతర పరిణామాలతో ప్రస్తుతం కార్పొరేషన్‌లో పాలకవర్గ సభ్యుల సంఖ్య టీడీపీకి పెరగాయి. దీంతో పగ్గాలను కూటమి కైవసం చేసుకున్నట్లే. టీడీపీ-6, జనసేన-1 ఉండగా, తాజాగా 19మంది వైసీపీ సభ్యులు టీడీపీలో చేరడంతో టీడీపీ కార్పొరేటర్‌ల సంఖ్య 26కు చేరుకుంది. దాంతోపాటు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ కార్పొరేషన్ ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా ఉండటంతో టీడీపీ బలం 29కి పెరిగింది. దీంతో కార్పొరేషన్ పాలకవర్గం టీడీపీ కూటమిదే.

త్వరలోనే సీఎం చంద్రబాబు వద్దకు..

బుధవారం తూర్పునాయుడు పాలెంలోని ఎమ్మెల్యే దామచర్ల స్వగృహంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమైనట్లు వైసీపీ కార్పొరేటర్లు ప్రకటించారు. ఎమ్మెల్యేకు సంపూర్ణ మద్దతు తెలపడంతో పాటు టీడీపీకి జైకొట్టారు. వారికి తెలుగుదేశం పార్టీ జెండాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే వారితోపాటు, టీడీపీ కార్పొరేటర్లను అభినందించారు. ఇక నుంచి కార్పొరేషన్‌లో టీడీపీ కూటమి పాలకవర్గం కొనసాగనుందని తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వద్దకు అందరినీ తీసుకెళ్ళి పరిచయం చేయనున్నట్లు సమాచారం.

నగర అభివృద్ధి కోసమే: ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సమష్టిగా ముందుకెళతాం. గతంలో టీడీపీ సభ్యుల సంఖ్య తక్కువగా ఉన్నందున అభివృద్ధి కోసం పోరాడినా సాధ్యపడలేదు. అయితే తాజాగా వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరడం సంతోషంగా ఉంది. ఒంగోలులో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేందుకు అవసరమైన చర్యల్లో భాగంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. వైసీపీలో ఉండి కూడా అభివృద్ధి చేయలేకపోయామనే భావనలో ఉన్న కార్పొరేటర్లు టీడీపీ కూటమిపై నమ్మకంతో పార్టీలో చేరడం అభినందనీయం. అందరినీ సమన్వయం చేసుకుని ఐక్యంగా, అభివృద్ధి చేయడమే మా ముందు ఉన్న లక్ష్యం. రహదారులు, డ్రైన్‌లు, రోజు నీటిసరఫరా, పోతురాజు కాలువ ఆధునీకరణ, పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టిసారించాం. రాబోయే ఐదేళ్లలో ఒంగోలు నగరాన్ని అందంగా మార్చి అభివృద్ధి చేస్తాం.

పంచాయతీ నిధులు గోల్‌మాల్

8 నెలల్లో రూ.20 లక్షలు అక్రమంగా డ్రా

వైసీపీ అండతో తర్లుపాడు కార్యదర్శి నిర్వాకం

సర్పంచ్ భర్త సహకారంతో సొంత ఖాతాల్లోకి నిధుల మళ్లింపు

ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు



తర్లుపాడు సచివాలయం

తర్లుపాడు, ఆగస్టు 14: ప్రభుత్వం మారినా తర్లుపాడు పంచాయతీ అధికారుల తీరు మారలేదు. ఇంకా వైసీపీకి పంచాయతీ కార్యదర్శి అంటకాగుతూ యథేచ్ఛగా నిధులు గోల్‌మాల్ చేస్తున్నాడు. దీనికి తోడు ఉన్నతాధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో గత ఐదేళ్ల నుంచి ఆయన అక్రమాలకు అంతులేకుండా పోయింది. ఎవరైనా పంచాయతీ నిధుల గురించి ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడుతున్నాడు. గత 8నెలల కాలంలో రూ.20లక్షల మేర నిధులు డ్రా చేశారు. తర్లుపాడులో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా అవకతవకలకు పాల్పడి అక్రమంగా నిధులు డ్రా చేశారు. ఈనెల 1న గుట్టుచప్పుడు కాకుండా ఎలాంటి బిల్లులు గానీ, ఎం బుక్కులుగానీ లేకుండా రూ.4,14,606 డ్రా చేశాడు. సచివాలయం నిర్వహణ పేరుతో కార్యదర్శి సొంత అకౌంట్‌కు రూ.98,435, ప్రభాకర్ పేరుతో మోటర్ రిపేర్ కింద రూ.2,99,107, సర్పంచ్ గౌరవ వేతనం రూ.17,064 డ్రా చేశాడు. గడచిన ఫిబ్రవరిలో కూడా సచివాలయ నిర్వహణకు కార్యదర్శి సొంత అకౌంట్‌కు రూ.40,000 డ్రాచేశాడు. ఏప్రిల్‌లో రూ.60,000, మేలో రూ.25వేలు సచివాలయం నిర్వహణ పేరుతో డ్రా చేశాడు. 15వ ఫైనాన్స్ కమిషన్ కింద చెత్త ట్రాక్టర్ డీజిల్ కోసం రూ.2,61,108, బ్లీచింగ్, సున్నంకు రూ.2,17,660, బోర్ల రిపేర్ కింద రూ.6లక్షలు, కాలువల పూడికతీత పనుల కోసం రెండుమార్లు రూ.1,35,000, వీధిలైట్ల కోసం రూ.1,35,000 ఇలా నిధులు డ్రా చేసి మింగేశాడు. గత ఏడాది నుంచి తర్లుపాడులో లైట్లు వేసిన దాఖలాలు లేవు. పారిశుధ్యం మచ్చుకు కూడా కనపించలేదు. ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండానే పంచాయతీ నిధులు అక్రమంగా డ్రా చేసిన విషయం గురించి ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడుతున్నాడు. రెండు నెలల క్రితం ఒక విలేకరి తర్లుపాడు పంచాయతీ నిధుల గురించి సమాచారం అడిగితే ఆయనపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాడు. అదే సమయంలో పంచాయతీ రికార్డులు పోయాయంటూ సచివాలయంలో పనిచేస్తున్న వీఆర్వో భాస్కర్‌రెడ్డిపై కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 45 రోజుల క్రితం తర్లుపాడు పంచాయతీ నిధుల వివరాలు ఇవ్వాలని టీడీపీ యువనాయకుడు కందుల రోహిత్ రెడ్డి, మరో 20 మంది నాయకులతో కలిసి లిఖిత పూర్వకంగా అర్జీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు సమాచారం ఇచ్చిన దాఖలాలు లేవు. గతంలో ఈవోపీఆర్‌డీగా అమరేశ్వరరావు విధులపట్ల అంకితభావంతో పనిచేశాడు. ఆయన వైసీపీ సర్పంచ్‌లు చేసే అవకతవకలపై సంతకాలు చేయలేదనే ఉద్దేశంతో 2నెలలపాటు దీర్ఘకాలిక సెలవు పెట్టారు. దీంతో తర్లుపాడు కార్యదర్శి అచ్యుత్‌రావుకు ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీగా బాధ్యతలు ఇచ్చారు. వైసీపీ నాయకులతో అంటకాగుతున్న కార్యదర్శి అచ్యుత్‌రావు వారు ఏం చెబితే అదే వేదంగా పనిచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంచాయతీ కార్యదర్శి సొంత అకౌంట్‌లోకి డబ్బులు డ్రా చేసుకోకూడదు. ఆ నిబంధనలు తుంగలోకి తొక్కి కార్యదర్శి సొంత అకౌంట్‌లోకి నిధులు డ్రా చేసుకున్నాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తర్లుపాడు పంచాయతీ కార్యదర్శి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


బిల్లులు లేకుండా నిధులు డ్రా వాస్తవమే

తర్లుపాడు పంచాయతీ కార్యదర్శి ఎలాంటి బిల్లులు లేకుండా ఈనెల 1న రూ.4,14,606 నిధులు డ్రా చేసిన మాట వాస్తవమేనని ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, ఈవోపీఆర్‌డీ బాలకృష్ణ తెలిపారు. తర్లుపాడు పంచాయతీ నిధుల అవకతవకలపై ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఈవోపీఆర్‌డీ తెలిపారు.

దేశభక్తిని చాటేలా హర్‌ఘర్ తిరంగా

కలెక్టర్ తమీమ్ అన్సారియా

700మీటర్ల జెండా ప్రదర్శనను ప్రారంభించిన ఎమ్మెల్యే



నగరంలో జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 14: ఆజాదీకా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు దేశభక్తిని చాటేలా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక చర్చి సెంటర్ నుంచి బుధవారం మధ్యాహ్నం పేస్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 700 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శనను కలెక్టర్ అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఈ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించేలా సెల్ఫీ పాయింట్లు, తిరంగా సిగ్నేచర్ క్యాంపెయినింగ్, తిరంగా యాత్రలు., ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవాన్ని పురష్కరించుకొని యువతలో దేశభక్తిని పెంపొందేలా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో సమరయోధులు ఎంతో కృషిచేశారన్నారు. ఎన్నో త్యాగాలను చేశారని గుర్తుచేశారు. వారి త్యాగాలను, కృషిని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ చర్చిసెంటర్ నుంచి రిమ్స్ వరకు నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో విద్యార్థులు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఉషారాణి, లోకేశ్వరరావు, రవికుమార్‌తోపాటు పేస్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంకు సమస్యలపై వినతి

అద్దంకిటౌన్, ఆగస్టు 14 : అద్దంకి ఆర్టీసీ డిపోలో పలు సమస్యలను పరిష్కారించాలని ఎన్ఎంయూఏ అద్దంకి డిపో కమిటీ ఆధ్వర్యంలో బుధవారం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిపో సెక్రటరీ ఏవీ బాబు మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్‌లు స్పేర్‌లో ఉండి డ్యూటీ రాని సమయంలో 2గంటలపాటు వారిని డిపోలో స్పేర్‌లో కూర్చోబెట్టి బలవంతంగా సెలవు వేసి ఇంటికి పంపిస్తున్నారన్నారు. దీనివల్ల సెలవులన్నీ అయిపోయి అత్యవసర సమయంలో సెలవు పెడితే జీతం కట్ అయి వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనకు సిద్ధమవుతామని తెలిపారు.

స్వాతంత్ర్య దిన వేడుకలకు భారీ ఏర్పాట్లు

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి స్వామి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 14 : భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశారు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవానికి రంగం సిద్ధమైంది. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్‌డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి గురువారం ఉదయం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించనున్నారు. అనంతరం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తారు.



సోమశిలలో పెరుగుతున్న నీటిమట్టం

అనంతసాగరం: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో నీటి నిల్వ 20 టీఎంసీలు దాటింది. బుధవారం 8,427 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 20.343 టీఎంసీలకు చేరుకుంది. దిగువ డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



నెల్లూరు: పోలీస్ కవాతు మైదానంలో రూపుదిద్దుకున్న వేదిక

స్వేచ్ఛా.. సంక్షేమం అదే ఆకాంక్ష!

గతానికి భిన్నమైన వాతావరణం కోరుకుంటున్న జనం

ఈ స్వాతంత్ర్య దినోత్సవం వెదజల్లాలి స్వేచ్ఛా సుగంధం...!!!

- ఐదేళ్లపాటు వణికిపోయిన సామాన్య జనం
- సహజ వనరుల దోపిడీ.. రక్షణ కరువు

కన్యాశుల్కం నాటకంలో మనకు స్వాతంత్ర్యం వచ్చిందంటూ గొప్పగా చెబుతాడు గిరీశం పాత్రధారి. స్వాతంత్ర్యం వల్ల జరగబోయే అభివృద్ధిపై పెద్దగా ఉపన్యాసం ఇస్తాడు.

ఇదంతా విన్న దర్జీ (టైలర్) అవన్నీ పక్కనపెట్టు కానీ.... స్వాతంత్ర్యం వచ్చిందన్నావు కదా..! అయితే మన ఊరి హెడ్ కానిస్టేబుల్ మారిపోతాడా..!!!? అని ప్రశ్నించాడు. అతని ప్రపంచానికి ఆ ఊరి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబులే ప్రధాన సమస్య.

స్వాతంత్రానికి పూర్వం రచించిన ఈ నాటకంలో దర్జీ (టైలర్) ప్రశ్న బ్రిటీష్ కాలంలో పోలీస్ దాష్టికానికి అద్దం పడుతుంది.

గత ఐదేళ్ల పాలనలో ప్రజలు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారు. ప్రభుత్వం మారిన క్రమంలో కన్యాశుల్కం నాటకంలోని టైలర్ కోరుకున్నట్లే తమ ఊరి పోలీసులు మారిపోతే చాలు అని ఆశపడ్డారు. బ్రిటీష్ పాలన ఎలా ఉండేదో చెప్పే ప్రత్యక్ష సాక్షులు ఇప్పుడు ఉండకపోవచ్చుగానీ గత పాలనలో చాలా మంది బ్రిటీష్ పాలనే నయం అంటూ గుసగుసలాడుకున్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలోగానీ, సహజ వనరుల దోపిడీ విషయంలోగానీ, పరదాల చాటున తిరిగిన రాష్ట్రాధినేత విషయంలోగానీ చాలా విషయాల్లో బ్రిటీష్ పాలనను గుర్తు చేసుకున్నారు. అందుకు భిన్నమైన వాతావరణం కోరుకున్నారు.

స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తి స్వేచ్ఛ. స్వాతంత్ర్య నినాదం స్వేచ్ఛ. అయితే గడచిన ఐదేళ్ల పాలనలో కేవలం కొద్ది మంది మినహా మిగిలిన వారందరూ బిక్కుబిక్కుమంటూనే బతికారు. ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేసిన పోలీసు స్టేషన్లు ఆ నాటి అధికార పార్టీ నేతల అతిథి గృహాలుగా మారిపోయాయి. పేరుకు పోలీసులేగానీ పెత్తనమంతా అధికార పార్టీ నాయకులే చలాయించారు. పోలీసుల చేతిలోని లాఠీ న్యాయాన్యాయాల విచక్షణ మరిచిపోయింది. చట్టాలు వైసీపీ నాయకుల ప్రయోజనాలకు అనుగుణంగా మారిపోయాయి. రాజకీయ కక్షలు పెచ్చుమీరాయి. బలహీనుల ఆస్తులు ఆక్రమణకు గురయ్యాయి. పాలకుల మెప్పు కోసం ఎంతో మంది సామాన్యుల ప్రాణాలను బలితీసుకున్న పాపాన్ని పోలీసులు మూటకట్టు కున్నారు.

సహజ వనరుల దోపిడీ

200 ఏళ్ల బ్రిటీష్ పాలనలో దేశ సంపద దోపిడీ జరిగిందని చరిత్ర పాఠ్యాంశాల్లో చెబుతారు. అది ఎంత వరకు నిజమో తెలియదుగానీ గత ఐదేళ్ల కాలంలో జరిగిన సహజ వనరుల దోపిడీని మాత్రం ప్రజలు కళ్లారా చూశారు. ఈ క్రమంలో మరోసారి బ్రిటీష్ పాలనను గుర్తుకు తెచ్చుకున్నారు. సగటు మనిషికి గంపెడు ఇసుక దొరకలేదుగానీ వైసీపీ నాయకులు మాత్రం టిప్పర్ల కొద్దీ ఇసుకను పక్క రాష్ట్రాలకు తరలించి కోట్లు సంపాదించు కున్నారు. కొత్త పాలసీలతో రాష్ట్రంలోని ఇసుక, సిలికా నిక్షేపాలను కావాల్సిన వారికి దారాదత్తం చేసుకున్నారు. అక్రమ మైనింగ్‌తో కొండలు, గుట్టలను కొల్లగొట్టారు. జగనన్న లే అవుట్ల పేరుతో మట్టి దిబ్బలను నిలువునా మింగేశారు. ప్రజల కళ్లముందే నిరాటంకంగా సాగిన ఈ ఐదేళ్ల దోపిడీని చూసిన ప్రజలు బ్రిటీష్ పాలననే గుర్తుకు తెచ్చుకున్నారు.

దొరతనం ఛాయలు

బ్రిటీష్ పాలనలో దొరల దర్శనం సామాన్యులకు దుర్లభం. ప్రజాస్వామ్య యుగంలో సైతం రాష్ట్ర ప్రజలు అలాంటి పరిస్థితులనే ఎదుర్కొన్నారు. నాలుగున్నరేళ్లపాటు రాష్ట్రాధినేత ప్రజలకు దూరంగానే గడిపారు. ప్రజలకే కాదు, ఎమ్మెల్యేలకు కూడా ఆయన దర్శనం ఉండదు. క్యాబినెట్ సమావేశంలో నోరు మెదిపే స్వాతంత్ర్యం లేక మంత్రులు మౌనమునుల అవతారం ఎత్తారు. ఎవరి అభిప్రాయానికీ విలువలేదు. తను ఒక దైవాంశ సంభూతునిగా, తను చెప్పిందే వేదంగా రాష్ట్రాధినేత పాలన సాగించారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల్లో భావ ప్రకటన స్వేచ్ఛ అతి ముఖ్యమైనది. దురదృష్టం ఏమంటే గడచిన ఐదేళ్ల కాలం ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలు, ఎంపీలకే ఆ హక్కు లేకుండా పోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే బ్రిటీష్ పాలన కంటే మిన్నగా నియంత పోకడల మధ్య రాష్ట్ర ప్రజానీకం నలిగిపోయింది.


ప్రజల ఆకాంక్షాలు నెరవేరాలి

భయానక వాతావరణం... విచ్చలవిడి దోపిడీ విధానం... నిరంకుశ మనస్తత్వాల మధ్య నలిగిపోయిన ప్రజలు నిజమైన ప్రజాస్వామ్య పాలన కోసం ఉద్యమించారు. ఎన్నికల ద్వారా చరిత్రాత్మక తీర్పు నిచ్చారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య వాతావరణం కోసం కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. వారి ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత కూటమి ప్రభు త్వంపై ఉంది. అధికారంలోకి వచ్చామన్న అత్యుత్సాహమో లేక పాత సీసాలోకి వచ్చిన కొత్త సారా నైజమో.. అక్కడక్కడా అప్పుడే తప్పటడుగులు పడుతున్నాయి. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధ మైన సంఘటనలు చోటు చేసుకొంటున్నాయి. ప్రతీకారాల పేరిట గత పాలకులు చేసిన తప్పులు కొన్నిచోట్ల పునరావృతం అవుతున్నాయి. సగటు మనిషికి ఎమ్మెల్యేలు కనిపించని విధం గా పైరవీకారుల కోటరీలు ఏర్పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వీటన్నింటిని అధిగమించా లని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. పోలీసు స్టేషన్లు సగటు మనిషి పాలిట దేవాలయాలు కావాల ని కోరుకొంటున్నారు. సహజ వనరులు భావితరాల భవిష్యత్తు కోసం వినియోగించబడాలని ఆశిస్తున్నారు. సంక్షేమంతోపాటు గ్రామగ్రామాన అభివృద్ధి కనిపించాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం నిజమైన ప్రజాస్వామ్య పాలనకు నాంది పలకాలని అభిలషిస్తున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



రాపూరులో భారీ త్రివర్ణ పతాకంతో విద్యార్థుల ర్యాలీ



బుచ్చిలో 300 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన



వెంకటాచలం : విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న వీఎస్‌యూ వీసీ విజయభాస్కరరావు

78వ స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సన్నద్ధం

నెల్లూరు (ఆంధ్రజ్యోతి): ఎన్నో పోరాటాలకు ఆరంభ వేదిక.. మరెందరో మహానుభావులకు పురిటిగడ్డ.. సింహపురి సీమ. స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించిన సింహపురి గడ్డ గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముస్తాబైంది. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలన్నీ విద్యుద్దీపాలంకరణలతో కళకళలాడుతున్నాయి. నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను ఘనంగా చేశారు. ఉదయం 9 గంటలకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పోలీసు పరేడు మైదానంలో జాతీయ జెండాను ఎగరవేయనున్నారు. అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి, విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన 61 ప్రభుత్వ శాఖల్లోని 463 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తారు. వివిధ శాఖలు తమ ప్రగతిని తెలియజేస్తూ శకటాలను ప్రదర్శించనున్నాయి. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం రాత్రి కస్తూర్బా కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కాగా పోలీసు పరేడు మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ బుధవారం పరిశీలించారు. అలాగే ఎస్పీ కృష్ణకాంత్ కూడా మైదానాన్ని పరిశీలించి, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉదయం 7.30 గంటలకు కలెక్టర్ జెండాను ఎగురవేయనున్నారు. కాగా, హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా విద్యార్థులు త్రివర్ణపతాకాలను చేతబూని ర్యాలీలు నిర్వహించారు.

రంగనాథుడికి తిరుమంజనం



నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 14 : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం తిరుమంజన సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం మహాకుంభా రాధన, నిత్యహోమాలు, పవిత్ర ప్రతిష్ఠ, పవిత్ర సమర్పణ జరిగాయి. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఆలయంలో గురువారం ఉదయం 9.30గంటలకు జెండా వందనం జరుగుతుందని ఈవో తెలిపారు.

కొత్త జేసీ కార్తీక్



నెల్లూరు (వ్యవసాయం) : జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కే.కార్తీక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా జేసీగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన నెల్లూరుకు వచ్చారు. బుధవారం ఉదయం కలెక్టర్ వద్ద డీఆర్వో లవన్న నూతన జేసీకి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్ర మాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

విద్యుత్ శాఖకు బెస్ట్ సర్కిల్ అవార్డు

నెల్లూరు (జడ్పీ) : స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ ప్రకటించిన బెస్ట్ సర్కిల్ అవార్డును నెల్లూరు విద్యుత్తు శాఖ దక్కించుకుంది. నాణ్యమైన కరెంటు సరఫరా, సేవలు తదితర అంశాలలో ఇతర జిల్లాలకంటే నెల్లూరు ప్రథమ స్థానంలో ఉన్నట్టు ఆ సంస్థ ప్రకటించింది. బెస్ట్ డివిజన్ అవార్డును కావలి, అతితక్కువ అంతరాయాలు ఉన్న డివిజన్‌గా నెల్లూరురూరల్, డెవలప్‌మెంట్ చార్జీల వసూళ్లలో నెల్లూరు డివిజన్ ప్రత్యేక అవార్డులు దక్కించుకున్నాయి. ఎస్ఈ విజయన్ నేతృత్వంలో ఈ అవార్డులు దక్కడంతో బుధవారం ఆయన్ను అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నేతలు ప్రత్యేకంగా అభినందించారు.

అమ్మా నాన్న సారీ.. ఈ టార్చర్ భరించలేను!

- మాధవనగర్‌లో యువకుడి ఆత్మహత్య
- మృతుడికి మూణ్నెళ్ల క్రితమే ప్రేమవివాహం
- అంతలోనే మనస్పర్థలు.. పుట్టింటికి వెళ్లిన భార్య
- సెల్ఫీ వీడియో తీసుకుని భర్త బలవన్మరణం



మృతుడు హరీష్ (ఫైల్)

వింజమూరు, ఆగస్టు 14 : 'అమ్మానాన్న నన్ను క్షమించండి. ఈ టార్చర్ నేను భరించలేను. నేను చనిపోవాలనుకుంటున్నా. అందరికీ సారీ.' అంటూ వింజమూరు మండలంలో ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్థుల కథనం మేరకు.. మండలంలోని మాధవ్‌నగర్‌కు చెందిన బ్రహ్మయ్య, ప్రభావతిల కుమారుడు హరీష్ (25), అదే గ్రామానికి చెందిన ఓ యువతి మూడు నెలల క్రితం ప్రేమపెళ్లి చేసుకున్నారు. అయితే, ఇంత లో ఏం జరిగిందో ఏమో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దీంతో నెల రోజుల క్రితం ఆ యువతి పుట్టినింటికి వెళ్లిపోయింది. రోజులు గడుస్తున్నా భార్య కాపురానికి రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన హరీష్ తన మనోవేదనను సెల్ఫీ వీడియోలో వ్యక్తపరిచాడు. అనంతరం ఇంటిలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బుధవారం సాయంత్రం గ్రామంలో బంధువులు అశ్రునయనాల నడుమ యువకుడి అంత్యక్రియలు జరిగాయి. కాగా, ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కోటిరెడ్డి తెలిపారు.

వ్యవసాయంలో కీలకమైన సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. గడిచిన ఐదేళ్లుగా సాగునీటి సంఘాల పాలకవర్గాలు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. అధికారులే ఇన్‌చార్జులు కావడంతో క్షేత్రస్థాయి సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారు. కనీసం పలానా కాలువలో పూడిక తీయాలి అని బాధ్యత తీసుకున్నవారు కూడా లేరు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా సాగునీటి సంఘాలకు పాలకవర్గాలను నియమించి రైతాంగానికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎన్డీయే ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి వివరాలను పంపాలని జిల్లా ఇరిగేషన్ అధికారులను ఆదేశించింది. ఎన్నికల నిర్వహణకు ఏవైనా ఆటంకాలు ఉన్నాయా..? ఒకవేళ అటువంటి పరిస్థితి ఉంటే నామినేటెడ్ కమిటీలను ఏర్పాటు చేయాలా..? అన్న అంశాలపై ప్రభుత్వం ఉన్నతాధికారులతో సమీక్షిస్తోంది.

- జిల్లా నుంచి వివరాలు సేకరించిన ప్రభుత్వం
- జిల్లాలో ఐదు పీసీలు, 13 డీసీలు, 765 డబ్ల్యూఏలు
- త్వరలో నోటిఫికేషన్ వెలువరించే అవకాశం
- ఐదేళ్లుగా పాలకవర్గాలు లేక రైతాంగానికి అవస్థలు
- శిస్తు వసూలు లేదు.. కాలువల్లో పూడిక తీయలేదు

సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం

నెల్లూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి యాజమాన్యంలో నీటి సంఘాలది కీలకపాత్ర. ఆయా గ్రామాలు, కాలువల పరిధిలో నీటి వృథా జరగకుండా ప్రతి ఎకరాకు నీటిని అందించేలా ఈ సంఘాలు కృషి చేస్తుంటాయి. అటువంటి సంఘాలకు వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలు నిర్వహించకపోగా కనీసం నామినేటెడ్ కమిటీలను కూడా వేయలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని సాగునీటి సంఘాల వివరాలను ఇరిగేషన్ అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపారు. ప్రభుత్వం సూచించిన ప్రొఫార్మా ప్రకారం మూడు రోజుల క్రితం వివరాలన్నీ రాష్ట్ర జలవనరుల శాఖకు చేరాయి. జిల్లాలో రెండు మేజర్ ప్రాజెక్టు కమిటీలు సోమశిల, పెన్నా డెల్టాలు ఉన్నాయి. ఈ రెండింటికి సోమశిల ఎస్ఈ, రెగ్యులర్ ఇరిగేషన్ ఎస్ఈలు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. అలానే మరో మూడు మీడియం ప్రాజెక్టు కమిటీలు గండిపాలెం ప్రాజెక్టు, కనుపూరు కెనాల్, స్వర్ణముఖి ఆయకట్టు సిస్టమ్ ఉన్నాయి. వీటితోపాటు 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 765 చిన్న తరహా సాగునీటి సంఘాలు ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఇన్‌చార్జులుగా ఉండగా, చిన్న తరహా సాగునీటి సంఘాలకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారులు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు.

● కమిటీల్లేకుండా కాలయాపన

సాగునీటి సంఘాలకు చాలా కాలం నుంచి ఎన్నికలు జరగలేదు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో కూడా ఎన్నికలకు ఇబ్బందులు ఉండటంతో అప్పటి ప్రభుత్వం రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి సంఘానికి నామినేటెడ్ కమిటీని నియమించింది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటి సంఘాలను గాలికొదిలేసింది. టీడీపీ ప్రభుత్వం నియమించిన కమిటీలను రద్దు చేసి ఆ బాధ్యతలను ఇరిగేషన్ ఇంజనీర్లకు అప్పగించింది. కమిటీలను రద్దు చేసినంత స్పీడు కొత్త కమిటీలను నియమించడంలో వైసీపీ ప్రభుత్వం చూపలేదు. ఐదేళ్లపాటు అటు ఎన్నికలు జరపక, ఇటు నామినేటెడ్ కమిటీలను నియమించకుండా సాగును నిర్లక్ష్యం చేసింది. దీంతో రైతులు ఏ కాలువలో, ఏ తూములో సమస్య వచ్చినా డివిజన్ కేంద్రానికి వచ్చి అధికారులకు చెప్పుకోవాల్సి వచ్చింది. అదే సమయంలో కాలువలపై కీలకంగా వ్యవహరించే లస్కర్లను కూడా తొలగించడంతో రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

● ఐదేళ్లు నేతల చేతుల్లోనే!

నీటి సంఘం పరిధిలోని ఏ కాలువలో పనులు చేయాల్సి ఉన్నా ఆ సంఘం పాలకవర్గమే చూసుకునేది. ఈ సంఘాలకు ఆర్థిక లావాదేవీలు చేసే అధికారం కూడా ఉంది. ఈ సంఘంలోని సభ్యులంతా స్థానికులు కావడంతో వారు బాధ్యతగా వ్యవహరించేవారు. రైతులకు ఏ సమస్య వచ్చినా వెంటనే వీరి దృష్టికి తెచ్చేవారు. రైతులు చెల్లించే శిస్తును ఈ సంఘాలకు జమ చేసి తద్వారా కాలువల్లో అభివృద్ధి పనులు చేసేవారు. కానీ గడిచిన ఐదేళ్లగా శిస్తు వసూలు చేసేవారు కూడా లేకుండా పోయారు. ప్రస్తుతం జిల్లాలో రూ.50 కోట్ల వరకు శిస్తు వసూలు చేయాల్సి ఉంది. ఈ ప్రభావం నీటి యాజమాన్యంపై తీవ్రంగా పడుతోంది. కాలువల్లో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులను సాగునీటి సంఘాల ద్వారా చేపడుతుంటారు. వీరంతా రైతులు కావడంతో పనులన్నీ పక్కాగా చేయించేవారు. కానీ గడిచిన ఐదేళ్లగా ఈ సంఘాలు లేకపోవడంతో ఓఅండ్ఎం పనులను టెండర్లు ద్వారా దక్కించుకున్న వైసీపీ నేతలు పనులు చేయకుండానే బిల్లులు తినేశారు.

వివరాలు పంపాం

సాగునీటి సంఘాల వివరాలు వెంటనే పంపాలని రాష్ట్ర ఉన్నతాధికారులను ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో ఉన్న ప్రాజెక్టు కమిటీలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, డబ్ల్యూఏల వివరాలన్నీ పంపాం. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

- పీ కృష్ణమోహన్, ఇరిగేషన్ ఎస్ఈ

విద్యుత్ బిల్లు చెల్లించలేదంటూ టోకరా

ఉపాధ్యాయుడి ఖాతా నుంచి రూ.64 వేలు స్వాహా

కలువాయి: 'మీరు ఈనెల కరెంటు బిల్లు చెల్లించలేదు.. మీ సర్వీసును తొలగిస్తాం' అంటూ ఓ ఉపాధ్యాయుడి ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్ పంపాడు. అంతేకాక అతడి బ్యాంకు ఖాతా నుంచి రెండు దఫాలుగా రూ.64వేలు కాజేశాడు. ఈ సంఘటన బుధవారం కలువాయిలో చోటుచేసు కుంది. పోలీసుల కథనం మేరకు, కలువాయి మండలం చీపినాపి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వీ.నారాయణరావు ఫోన్‌కు 'మీరు ఈనెల కరెంట్ బిల్లు చెల్లించలేదు' అంటూ ఓ వ్యక్తి మెసేజ్ పంపాడు. వెంటనే ఆ ఉపాధ్యాయుడు కాల్ చేసిన వ్యక్తికి ఫోన్ చేసి నేను బిల్లు చెల్లించానని తెలిపారు. అయితే మీరు చెల్లించనట్లు చూపిస్తుందని.. నేను ఒక యాప్ పంపిస్తాను దాన్ని అప్‌డేట్ చేసుకోవాలని ఆ వ్యక్తి చెప్పాడు. వెంటనే ఆ వ్యక్తి ఉపాధ్యాయుడికి యాప్ పంపాడు. ఆ టీచర్ కూడా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. దీంతో ఉపాధ్యాయుడి ఫోన్ అవతలి వ్యక్తి స్వాధీనంలోకి వెళ్లిపోవడంతో ఓ సారి రూ.49 వేలు, మరోసారి 15 వేలు బ్యాంకు ఖాతా నుంచి కట్ అయ్యాయి. దీంతో తాను మోసపోయాయని గ్రహించి ఆ ఉపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మకూరు అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయండి : మంత్రి ఆనం

ఆత్మకూరు, ఆగస్టు 14 : ఆత్మకూరు అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. మంత్రి ఆనం ముఖ్యఅతిథిగా హాజరై వివిధ శాఖల అభివృద్ధి పనులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాన్నారు. ఆత్మకూరు మండలానికి రూ. 117 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు మంజూరు కాగా, కేవలం రూ. ఏడు కోట్ల మేరకే పనులు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. మిగిలిన నిధులను కూడా ఆరునెలల్లోగా ఖర్చుచేసి ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆత్మకూరు మండలానికి మూడు లక్షల ఉపాధిహామీ పని దినాలు మంజూరయ్యాయని, గ్రామాల్లో ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో రెండు ప్రధాన రహదారులు అభివృద్ధికి రూ. 5.60 కోట్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు.

● 31న మంత్రి సత్యకుమార్ రాక

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఈనెల 31న ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు రానున్నారని మంత్రి ఆనం తెలిపారు. ఆయనతో చర్చించి ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. ఈనెలాఖరులోగా అధికారుల బదిలీలు పూర్తి చేసి సెప్టెంబరు 1 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. మంత్రి హోదాలో తొలిసారిగా సమావేశానికి విచ్చేసిన ఆనంకు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నేతలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కే మధులత, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డ్వామా పీడీ బీ శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ దయాకర్, ఎంపీడీవో పీ ఐజాక్‌ప్రవీణ్, మండల అధికారులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం

వాటర్ ప్లాంట్‌కు భూమి పూజ

సీతారామపురం, ఆగస్టు 14: మండలంలోని సీతారామపురం దళితవాడలో వాటర్ ప్లాంటు ఏర్పాటుకు బుధవారం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచి కే భాగ్యకుమారి, వైసీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి,కోఆప్షన్ మెంబర్ హైదర్‌వలి,కార్యదర్శి జీవన్,పిడతల ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

సంగం, ఆగస్టు 14: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, పంచాయతీల్లోనూ గురువారం జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

● ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలి

ఉదయగిరి రూరల్ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని 17 పంచాయతీల్లో వేడుకలు నిర్వహించడంతోపాటు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో డీ ఈశ్వరమ్మ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చేజర్ల : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలను కూడా అందంగా అలంకరించారు.

దుత్తలూరులో విద్యార్థుల మానవహారం


కలువాయి : కుల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దుత్తలూరు(ఉ దయగిరి రూరల్) : హర్ ఘర్ తిరంగా వేడుకల్లో భాగంగా బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు దుత్తలూరు సెంటర్‌లోని 565 జాతీయ రహదారిపై మానవహారం ఏర్పాటు చేశారు. తొలుత పాఠశాల నుంచి సెంటర్ వరకు జాతీయ జెండాలు చేతపట్టి నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, చుండి హరిగోపాల్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ సైమన్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీగా నిర్వహించారు. ప్రతీ ఇంట్లో జాతీయ జెండా రెపరెపలాడాలని, ప్రతి ఒక్కరూ దేశ భక్తితో మెలగాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, మండల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

కలువాయి : మండలంలోని కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్‌వాషా ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా బుధవారం విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఏజీఎంసీ వెంకటకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీవో జయకిషోర్, అధ్యాపకులు సురేష్, రామాంజనేయులు, శ్రీనివాసులు కల్పన, సుప్రజ పాల్గొన్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలని వినతి

ఉదయగిరి రూరల్ : ఉదయగిరిని జిల్లా చేయాలని కోరుతూ బుధవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ఉదయగిరి జిల్లా సాధన సమితి నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో వారు కలిశారు. అనంతరం మాట్లాడుతూ నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాల్లోని వెనుకబడిన 21 మండలాలను కలిపి ఉదయగిరిని కేంద్రంగా జిల్లా చేయాలన్నారు. జిల్లా అవశ్యకతపై సోమిరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు డాక్టర్ వేణుగోపాల్, షేక్ ఎండీ ఖాజా, ఓంకారం శ్రీనివాసరాజు, దశరథరామ్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు వెంటనే కార్డులు అందించాలి

కలువాయి : కౌలు రైతులకు కార్డులను త్వరితగతిన అందజేయాలని పొదలకూరు వ్యవసాయశాఖ ఏడీఏ కె.శివనాయక్ సిబ్బందికి సూచించారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలు, వీఏఏలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతుల కార్డులపై సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త కిరణ్, గ్రోమోర్ శాస్త్రవేత్త నర్సిరెడ్డి, ఎస్‌వో శశికాంత్, ఏవో ప్రతాప్, డీటీ.వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

సీతారామపురం : మండల పరిధిలోని అయ్యావారిపల్లిలో సాగులో ఉన్న మొక్కజొన్న పంటను పొదలకూరు ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సురేఖాదేవి బుధవారం సందర్శించారు. మొక్కజొన్న పైరులో పొగాకు లద్దెపురుగు, కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించామన్నారు. నివారణకు లీటరు నీటికి 5ఎంఎల్ వేప నూనె లేదా లీటర్ నీటికి 0.5 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ పిచికారీ చేయాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి పీ చెన్నారెడ్డి,వీఏఏ నరేంద్ర తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సీతారామపురం : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధిహామీ, విద్యాశాఖ, వైద్యఆరోగ్య శాఖ, అధికారులు తమతమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో నడవాలని, అందుకు ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. మండలాభివృద్ధికి అధికారులు చిత్త శుద్ధితో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు భాగ్యకుమారి, వెంకట సుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు పాల్గొన్నారు.

డీఎస్పీ వేణుగోపాల్ బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు : డీఎస్పీగా కే వేణుగోపాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ గంగాధర్‌రావు, పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఆయన్ను సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

తహసీల్దారుకి సన్మానం

సంగం : తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన సోమ్లానాయక్‌ను బుధవారం టీడీపీ నాయకులు శాలువాతో సత్కరించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి బాణా శ్రీనివాసులురెడ్డి, తలుపూరుపాడు టీడీపీ నాయకులు షేక్ ఖాదర్ బాషా తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు.

ఎంపీడీవోకి...

వరికుంటపాడు : ఎంపీడీవో తోట వెంకటకృష్ణకుమారి బదిలీపై ప్రకాశం జిల్లాకు వెళుతుండడంతో ఆమెను బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సన్మానించి, వీడ్కోలు పలికారు.

ముగిసిన సర్పంచుల శిక్షణ

ఉదయగిరి రూరల్ : స్థానిక స్త్రీశక్తి భవనంలో మూడు రోజులుగా జరుగుతున్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మల్లికార్జున పంచాయతీల అభివృద్ధికి, పారిశుధ్యం మెరుగుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, నెల్లూరు వెంకటస్వామి, వరలక్ష్మి, సామ్రాజ్యం, తిరుపతయ్య, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, కరీముల్లా పాల్గొన్నారు.

కావలి


కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఇన్‌చార్జిలే దిక్కు!

● అస్తవ్యస్తంగా పాలన ● కుంటుపడుతున్న అభివృద్ధి

● ప్రధాన శాఖల అధికారుల కుర్చీలు ఖాళీ

● ప్రభుత్వం మారినా కానరాని మార్పు



కావలి, ఆగస్టు 14 : కావలి డివిజన్‌లో ప్రధాన శాఖల అధికారుల కుర్చీలన్నీ ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జి అధికారుల పాలన అస్తవ్యస్తంగా మారి అభివృద్ధి కుంటుపడుతోంది. ముఖ్యంగా హౌసింగ్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, నీటి పారుదల శాఖలలో ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. ఇక్కడి ప్రధాన శాఖలకు అధికారులు లేకపోగా కొన్ని శాఖలకు ఉన్న అధికారులు ఇతర ప్రాంతాలకు ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. దీంతో ఇన్‌చార్జి అధికారులు ఎక్కడా న్యాయం చేయలేక కాలం వెళ్లబుచ్చుతున్నారని, ఫలితంగా అభివృద్ధి వైపు అడుగులు పడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభు త్వం మారినా పాలనలో మాత్రం మార్పు కనిపించటంలేదన్న గుసగుసలూ వినిపిస్తోన్నాయి.

● గృహ నిర్మాణ శాఖ నిర్వీర్యం

పేదలకు శాశ్వత గూడు కలిపంచేందుకు కోట్లాది రూపాయలతో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో గృహ నిర్మాణ శాఖలో ఈఈ, డీఈలు ఇద్దరు ఇన్‌చార్జులు కావడంతో ఆశాఖ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. ఒక్క కావలిలోనే సుమారు 6 వేల ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండగా వాటిలో అనేక అవినీతి అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఇళ్ల నిర్మాణ సమయంలో ఉన్న డీఈ ఖాజామొహిద్దీన్ ఈ ఏడాది మే నెలలో పదవీ విరమణ చెందగా ఆయన స్థానంలో కందుకూరు డీఈ శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే ఈఈ వరప్రసాద్ జూన్ 30న పదవీ విరమణ చెందగా ఆయన స్థానంలో నెల్లూరు డీఈ మాదవరావుకు కావలి ఇన్‌చార్జి ఈఈ బాధ్యతలు అప్పగించారు. పదవీ విరమణ చెందిన వారి స్థానంలో కొత్తవారిని నియమించకుండా ఇన్‌చార్జీలకు బాధ్యతలు అప్పగించటంతో వారు అక్రమాలకు నిలయమైన కావలిలో చేయి పెడితే కాలిపోతామన్న భయంతో చుట్టపు చూపుగా వచ్చిపోతూ కాలం వెళ్లబుచ్చుతున్నారు.

● కావలి అంటే విద్యుత్ అధికారులకే షాక్

కావలి పేరు వింటే విద్యుత్ శాఖ అధికారులే షాక్ తగులుతోంది. ఇక్కడి ఏడీఈ శంకరయ్య ఏడాది క్రితం బదిలీ చేయించుకుని వెళ్లా రు. అప్పటి నుంచి అల్లూరు, కలిగిరి ఏడీఈలు కొంత కాలం ఇన్‌చార్జిలుగా పని చేసి వారు కూడా మావల్ల కాదంటూ చేతులెత్తేశారు. దీంతో కావలి రూరల్ ఏఈ శ్రీనివాసులురెడ్డికి ఏడీ ఈ బాధ్యతలు అప్పగించారు. అలాగే కావలి వ న్‌టౌన్ ఏఈ కుమార్ ఒకటిన్నర సంవత్సరం కిందట బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఆ పోస్టులో ఎవరినీ నియమించకపోవడంతో కావలి టూటౌన్ ఏఈ వసంతరావు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఇన్‌చార్జి అధికారుల పర్యవేక్షణ కొరవడి విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదన్న వి మర్శలు ఉన్నాయి.

● ఆర్‌అండ్‌బీలో నూ అంతే...

కావలి ఆర్‌అండ్‌బీ డీఈ మస్తాన్‌రావు ఏడాది క్రితం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఆ పోస్టుకు ఎవరినీ నియమించక పోవడంతో దుత్తలూరు ఏఈ ఇన్‌చార్జి డీఈగా కొనసాగుతున్నారు. దీంతో ఆర్‌అండ్‌బీ రోడ్లపై గుంతలకు తట్టడు మట్టి వేసే పరిస్థితి కూడా కనిపించడం లేదన్న విమర్శలున్నాయి.

● ఇరిగేషన్‌లో రివర్స్ పాలన

కావలి ఇరిగేషన్‌లో రివర్స్ పాలన కొనసాగుతోంది. కావలి ఈఈ కృష్ణమోహన్ నెల్లూరు ఇన్‌చార్జి ఎస్ఈగా, కావలి డీఈ పీఎం ఖాన్ నెల్లూరు ఇన్‌చార్జి ఈఈగా కొనసాగుతోన్నారు. వీరిద్దరికి కావలి కన్నా నెల్లూరు ఇన్‌చార్జి పదవులు పెద్దవి కావడంతో వారు ఎక్కువ సమయం అక్కడే కేటాయించాల్సి వస్తోంది. కావలి డివిజన్‌లో వర్షాధారమైన చెరువులు ఎక్కువగా ఉండటంతో వాటి పటిష్టతకు అవసరమైన చర్యలు తీసుకోవడంపై అసలు దృష్టి పెట్టలేకున్నారు.

● కొత్త ప్రభుత్వంలోనైనా ఇన్‌చార్జి పాలన తొలగేనా?

రాష్ట్రంలో ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై ప్రజలు కోటి ఆశలతో వారికి అధికారం ఇచ్చి పాలనలో కొత్త దనం ఆశిస్తున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా ఖాళీలను భర్తీ చేసి ఇన్‌చార్జిల పాలనకు చరమగీతం పాడి సక్ర

నిరాడంబరుడు మస్తాన్ : ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, ఆగస్టు 14: మాజీ కౌన్సిలర్, సామాజిక కార్యకర్త, టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ మస్తాన్ నిరాడంబరుడని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కొనియాడారు. మస్తాన్ 88వ జన్మదిన వేడుకలు బుధవారం కావలి పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు తినిపించి మస్తాన్‌ను సత్కరించారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ ఎన్. ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ మస్తాన్ తనకు మంచి మిత్రుడిని తనతో కలిసి నడిచారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు పోతుగంటి అలేఖ్య, గుత్తికొండ క్రిషోర్, కండ్లగుంట మధుబాబు నాయుడు, బొట్లగుంట శ్రీహరినాయుడు, జ్యోతి బాబూరావు, నాయుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 100 అడుగల ఎత్తు జాతీయ జెండా ఆవిష్కరణ

కావలి, ఆగస్టు 14: వైసీపీ పాలనలో అమృత్ పైలాన్‌ను ధ్వంసం చేసిన చోట ఏర్పాటు చేసిన 100 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం ఆవిష్కరిస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం ఎదురుగా జాతీయభావం పెంపొందించే విధంగా నిర్మాణాలు చేపట్టామన్నారు. ఈ జాతీయ జెండాను విద్యార్థులతో ప్రారంభిస్తామన్నారు. కావలి పట్టణంలోని అని విద్యాసంస్థల విద్యార్థులు తమ విద్యాసంస్థలలో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం ర్యాలీగా ఇక్కడకు చేరుకుంటారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు తమవంతు కృషి చేయాలని కోరారు. మధ్యాహ్నం విద్యార్థులందరికీ భోజన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ క్రిషోర్, పోతుగంటి అలేఖ్య, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, జ్యోతి బాబూరావు, దావులూరి దేవకుమార్, జనిటర్ల మనోహర్, బాలగురుస్వామి, జనసేన పట్టణ అధ్యక్షుడు పొబ్బాసాయి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన


నిర్మాణ పనులకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే

కందుకూరు, ఆగస్టు 14: పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న అగపే చర్చి నుంచి ఉప్పు చెరువు రోడ్డులోని రాజరాజేశ్వరి ఆలయం వరకు డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.26.10 లక్షలతో నిర్మించనున్న ఈ డ్రైనేజీ పనులను తక్షణం ప్రారంభించి నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం ఏకలవ్యనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డు, డ్రైనేజి పూడికతీత పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి, నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉన్నం వీరాస్వామి, చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, బెజవాడ ప్రసాదు, కూనం నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న కడనూతల చెరువు : చనిపోతున్న చేపలు

బిట్రగుంట, ఆగస్టు 14: బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల చెరువు దాదాపుగా ఎండిపోవడంతో బుధవారం ఎండ బెట్టతో చేపలు చనిపోయి తేలాడుతున్నాయి. వేసవి కాలాన్ని తలపిస్తు భానుడు ప్రభావంతో మూగజీవులకు తాగునీరు కరువైంది. చెరువు సొసైటీ వివాదాల కారణంగా ప్రస్తుతం చెరువులో చేపలు పట్టడం నిలిపివేశారు. అయితే అనధికారికంగా కొందరు చనిపోతున్న చేపలను పట్టుకునే పనిలో ఉన్నారు. మూడు వందల ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉండే చెరువు ఎండిపోవడానికి ప్రధాన కారణం లోతులేక పోవడమేనని రైతులు అంటున్నారు. చెరువులో పూడిక తీసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

గిరిజన కాలనీలో అంతర్గత రోడ్లకు మరమ్మతులు

బిట్రగుంట, ఆగస్టు 14: బోగోలు మండలం చెంచులక్ష్మీపురం గిరిజన కాలనీలోని అంతర్గత రోడ్లు గోతులమయంగా మారడంతో టీడీపీ గిరిజన నేత బోగిరి ప్రభాకర్ తన సొంత నిధులతో బుధవారం మట్టి తోలించి మరమ్మతులు చేయించారు. రానున్న వర్షాకాలనీ దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు ముందస్తు పనులు చేస్తున్నామని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సంజయ్, సుభాని, కిరణ్, మొల్లా తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించండి

లింగసముద్రం, ఆగస్టు 14 : ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఆ పథకం కందుకూరు ఏపీడీ జె బాబూరావు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె శ్రీనివాసులు అధ్యక్షతన ఉపాధి హామీ పథకంపై సమీక్ష నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాలని, కొత్త పనులు గుర్తించాలని, కూలీల సంఖ్య పెంచాలని ఏపీవో షేక్ సమీర్‌బాషా, టీఏ ఈసీ చిన కోటయ్య, తదితరులను ఆదేశించారు.

ట్రాక్టర్ బోల్తా : యువకుడి మృతి


మృతి చెందిన ఏకుల వెంకటేశ్వర్లు

బిట్రగుంట, ఆగస్టు 14: బోగోలు మండలం సీఆర్ పాలెం పంచాయతీ పాతపాలెం శివారుల్లో బుధవారం సిమెంట్ బ్రిక్స్ లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తాపడి ఏకుల వెంక టేశ్వర్లు (18) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. అల్లూరు మండలం ఆర్‌డీఆర్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు ట్రాక్టర్ లోడింగ్ పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జువ్వలదిన్నెలో సిమెంట్ బ్రిక్స్ లోడ్ చేసుకుని తిరిగి అల్లూరుకు వస్తున్న సమయంలో పాతపాలెం శంభునిపాలెం మధ్య ఎదురుగా వస్తున్న స్కూల్ బస్సును తప్పించ బోయి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రక్కులో ఉన్న వెంకటేశ్వర్లు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు ఉన్న చెంచయ్య, శీనయ్యలకు గాయాలయ్యాయని ఏఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియచేసి మృతదేహాన్ని కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని ఆయన తెలిపారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

కొండాపురం, ఆగస్టు 14: మండలంలోని సాయిపేట పంచాయతీ ఎర్రబాలెంలో సీతారాములతోపాటు లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాల ప్రతిష్ఠ బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజులుగా పూజలు నిర్వహించి మూడవ రోజు విగ్రహాల ప్రతిష్ఠను వేదమంత్రోచ్చరణల నడుమ పండితులు ఘనంగా నిర్వహించారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి విరాళం

లింగసముద్రం, ఆగస్టు 14 : స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ మద్దా శివన్నారాయణ రూ.50 వేల వితరణ చేశారు. ఈ మేరకు 1993-94 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన ఆయన హెచ్ఎం ఉమ్మడిశెట్టి మాధవరావుకు బుధవారం చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ నారాయణ, కే.ప్రభాకర్, ఎం.కొండయ్య, కే.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై అవగాహన

కందుకూరు, ఆగస్టు 14: మండలంలోని దొండపాడులో కందుకూరు సీఐ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం శాంతిభద్రతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం ఇవ్వకుండా పోలీసులకు సహకరించాలన్నారు. జూదం, మద్యం, గంజాయి లాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు మీ దృష్టికి వస్తే మాకు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ రమణయ్య, తదితరులున్నారు.

యాచకులకు దుస్తుల పంపిణీ

కావలిటౌన్, ఆగస్టు 14: బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని యాచకులకు బుధవారం శివాలయం వద్దనున్న శంఖరమఠంలో దుస్తులు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పురుషులకు రెండు పంచలు, తువ్వాలు, మహిళలకు రెండు చీరలు, అందరికీ భోజన ప్యాకెట్లు అందించామన్నారు. కార్యక్రమంలో సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, రమేష్, రవికుమార్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా ఆసుపత్రి ఏర్పాటు వరం

కావలిటౌన్, ఆగస్టు14: కావలిలో తలసేమియా ఆసుపత్రి ఏర్పాటు వ్యాధిగ్రస్తులకు ఒక వరమని చెన్నైయ్ అపోలో చిన్నపిల్లల రక్తసంబంధిత వ్యాధి నిపుణులు డాక్టర్ రమ్య ఉప్పుటూరి పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ ఆహ్వానం మేరకు ఆమె కావలి రెడ్‌క్రాస్ రక్తనిధి ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తలసేమియా కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ రవిప్రకాష్, డాక్టర్లు బెజవాడ రవికుమార్, శ్రీధర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కలికి శ్రీహరిరెడ్డి, హరినారప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న ఎడ్ల బండలాగుడు పోటీలు

కందుకూరు, ఆగస్టు 14: మండలంలోని మహదేవపురంలో ఈనెల 18వ తేదీన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామదేవత అంకమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరు, ఆగస్టు 14 : మండలంలోని బీరంగుంట, నార్తుఆములూరు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అల్లూరు విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్‌షరీఫ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్ల ఏర్పాటు కారణంగా సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టండి

లింగసముద్రం, ఆగస్టు 14 : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రామసుబ్బారావు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

బిట్రగుంట, ఆగస్టు 14: బోగోలు మండలంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వెంకటసుబ్బారావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈశ్రీనివాసులు, ఈవోపీఆర్డీ శ్రీదేవి, మాలేపాటి నాగేశ్వరావు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి

వలేటివారిపాలెం : పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని కందుకూరు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త జి.ప్రసాద్ బాబు, ఏడీఏ అనసూయ తెలిపారు. బుధవారం శాఖవరం రైతు సేవా కేంద్రంలో క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ నిహారిక, మాయాంక్, ఏవో హేమంత్‌భరత్‌కుమార్ పాల్గొన్నారు.